తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# అక్రమ లేఅవుట్లు... పట్టించుకోని తుడా అధికారులు



మేనకూరులో వేస్తున్న లేఅవుట్లు

నాయుడుపేట జూలై 25 ప్రభాతవార్త : నాయుడుపేటలో అక్రమ లేఅవుట్లు పుట్టగొడుగుల్లా రోజురోజుకు పుట్టుకొస్తున్న సంబంధిత తుడా ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. పారిశ్రామిక వాడగా దినదిన అబివృద్ధి చెందుతున్న నాయుడుపేటలో ఇంటిస్థలాలకు మంచి డిమాండ్ పెరగడంతో దాన్ని అవకాశంగా తీసుకొన్న కొంతమంది రియల్టర్లు అరచేతిలో వైకుంఠం చూపిస్తూ మాయజాలం ప్రదర్శిస్తూన్నారు.నాయుడుపేట మండలంలోని మేనకూరు రెవెన్యూ పరిదిలోని సర్వేనెంబరు 90,95,176,177,190లలో ఏర్పాటు చేసిన లేఅవుట్లలో నిబంధనలు పాటించలేదని నిర్వహకులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండ నాయుడుపేటలో ఎక్కడ పడితే అక్కడ నామమాత్రంగా అక్రమ లేఅవుట్లు ఏర్పాటుచేసి ప్రజలను మోసం చేస్తున్నారు. తుడా ప్లానింగ్ నిబంధనల మెరకు రియల్టర్లు లేఅవుటు వేసేటప్పుడు ముప్పై అడుగల రోడ్లు,డ్రైనేజి కాలువలు, వాటరు, విద్యుత్ సర్వీస్సు,మొక్కల పెంపకం, లేఅవుట్లో పదిశాతం భూమిని పంచాయతీ కార్యదర్శి పేరుతో మార్టుగేజ్ చేసి తుడా ప్లానింగ్ అధికారుల నుండి అనుమతులు తీసుకోవాల్సి ఉండగా నాయుడుపేట మండలంలోని మేనకూరు, చలివేంద్ర ప్రాంతాల్లో మాత్రం రియల్టర్లు అలాంటి నిబంధనలు పాటించకుండా మాయ జాలం ప్రదర్శిస్తూ ఇష్టారాజ్యంగా లేఅవుట్లువేసి ఏలాంటి అనుమతులు లేకుండనే ప్లాట్లు అమ్మకాలు చేపడుతూ ప్రజలను దగా చేస్తున్నారు. నాయుడుపేటలో మండలంలో వేస్తున్న అక్రమ లేఅవుట్లుకు పంచాయితీ అధికారులు పలుదపాలుగా నోటీసులు జారీచేసిన పట్టించుకోకుండ ప్లాట్లు అమ్మకాలు చేపడుతున్నారు. ఈవిషయమై ప్రభాతవార్త తిరుపతి తుడా ప్లానింగ్ అధికారి వాణిశ్రీని వివరణ కోరగా ఆమె మాట్లడుతూ నాయుడుపేట మండలంలోని మేనకూరులో వేస్తున్న లేఅవుట్లుకు ఏలాంటి అనుమతులు ఇవ్వలేదని వాటిని పరిశీలించి అక్రమ లేఅవుట్లుకు నోటీసులు జారీచేసి చర్యలు తీసుకుంటామని ఆమె తెలియజేశారు.

# ప్రేమ తెచ్చిన విషాదం

**- ప్రియుడి ఇంటి ముందు నిప్పంటించుకున్న ఆర్టీసీ మహిళా కానిస్టేబుల్ - తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి!**
**- మృతురాలిది కడపజిల్లా .. కుప్పం మండలం మార్వాడలో సంఘటన**



మృతి చెందిన ప్రశాంతి (ఫైల్‌ఫోటో)

కుప్పం, జూలై 25 ప్రభాతవార్త : తనను వివాహం చేసుకోవాలని ప్రియుడి ఇంటి ముందు పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న ఆర్టీసీ సెక్యూరిటీ కానిస్టేబుల్ తీవ్రంగా కాలిన గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈసంఘటనకు సంబంధించి కుప్పం డిఎస్పీ పార్థసారథి తెలిపిన మేరకు వివరాలిలా.. కుప్పం మండలం మార్వాడ గ్రామంకు చెందిన వాసు అనే వ్యక్తి కడపలో నివాసంలో ఉంటూ మైదుకూరు పట్టణంలో శ్రీబాలాజీ ఫైనాన్స్ సంస్థలో కలెక్షన్ ఏజెంట్‌గా పనిచేసేవాడన్నారు. కాగా కడపలోనే నివాసం ఉంటున్న ప్రొద్దుటూరు ఆర్టీసీ డిపోలో సెక్యూరిటీ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కెవి గంగా ప్రశాంతి(24)తో వాసుకు పరిచయం ఏర్పడి అది ప్రేమగా మారింది. కాగా అప్పటికే వాసుకు పెళ్లి అయి భార్య, కుమారుడు ఉన్న విషయం ప్రశాంతికి వెల్లడించకుండా దాచిఉంచినట్లు తెలుస్తోంది. కాగా ఏడాది కాలంగా గంగా ప్రశాంతి తనను వివాహం చేసుకోవాలని వాసును ఒత్తిడి చేయడం మొదలు పెట్టగా వాసు ఆమెకు తెలియకుండా స్వగ్రామం మార్వాడకు వచ్చేసి కుటుంబంతో కలసి ఉంటున్నాడన్నారు. ఈనెల 23వతేది ఉదయం గంగా ప్రశాంతి వాసు చిరునామా తెలుసుకుని మార్వాడ గ్రామానికి వచ్చి తనను పెళ్లి చేసుకోవాలని వాసు ఇంటి వద్దకు చేరింది. వాసు కుటుం బీకులు, గ్రామ పెద్దలు ప్రశాంతి తల్లి మాలతిని కడపనుంచి పిలిపించి ఆమెతో పాటు ప్రశాంతిని పంపేశారు. అయితే 24వతేది సాయంత్రం ప్రశాంతి ఎవరికీ చెప్పకుండా మరలా మార్వాడ గ్రామం చేరుకుని వాసు ఇంటి ఆవరణలోకి ప్రవేశించి తనపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంది. వెంటనే వాసు, అతని కుటు ంబీకులు గ్రామస్తుల సాయంతో మంటలు ఆర్పి ఎనభైశాతం తీవ్ర ంగా కాలిపోయి గాయాలపాలైన ప్రశాంతిని కుప్పం ప్రభుత్వాస్పత్రికి అక ్కడనుంచి పిఇఎస్‌కు తరలించారు. ఆమె పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రశాంతి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు డిఎస్పీ తెలిపారు. కాగా పిఇఎస్ వైద్య కళాశాలలో మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ సమక్షంలో ప్రశాంతి నుంచి వాంగ్మూలం తీసుకుని నమోదు చేశామన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# మురుగునీటి కాలువల ఆధునీకరణకు రూ.5కోట్లు

**తుడా చైర్మన్ డాలర్ దివాక్‌రెడ్డి**



మోటార్ బైక్‌లపై ఎమ్మెల్యే, తుడా చైర్మన్

శ్రీకాళహస్తి,జూలై 25 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి శుక్రవారం వినూత్న కార్యక్రమంగా 'ఏ డే విత్ తుడా చైర్మెన్‌కు శ్రీకారం చుట్టారు.శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి, తుడా చైర్మెన్ డాలర్ దివాకర్‌రెడ్డిలు మోటార్‌బైక్‌లపై శ్రీకాళహస్తి పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలతో మమేకమయ్యారు. వారితో పాటు మున్సిపల్ అధికారులను కూడా పరుగులు తీయించారు. ఈ సందర్భంగా తుడా చైర్మెన్ శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో అభివృద్ధి కార్యక్రమాలకు మొదటిగా రూ.5కోట్లు కేటాయిస్తామని ప్రకటించారు. వారి పర్యటనలో ప్రజలు ముఖ్యంగా పానగల్ ప్రాంతంలో మంచినీటి సరఫరా అగమ్యగోచరంగా ఉందని, మురుగునీటి కాలువలు దుర్గంధ భరితంగా ఉన్నాయని నాయకుల దృష్టికి తెచ్చారు. అక్కడే ఉన్న కమిషనర్ సంజీవ్‌కుమార్‌తో చర్చించారు. మురుగునీటి కాలువలను మరమ్మతులతో పాటు ప్రతి రోజూ శుభ్రం చేయాలని ఆదేశించారు. శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి వెళ్ళి నపుడు తుడా చైర్మెన్ దివాకర్‌రెడ్డికి మౌళిక సదుపాయాలు, అస్తవ్యస్తంగా ఉన్న ఆవరణ పరిశీలించారు. సుమారు నాలుగుగంటల పాటు పట్టణంలోని పలు ప్రాంతాలో మోటార్‌బైక్‌లపై పర్యటించిన ఎంఎల్‌ఏ సుధీర్‌రెడ్డి,తుడా చైర్మెన్ దివాకర్‌రెడ్డిలు మీడియాతోమాట్లాడుతూ శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో అభివృద్ధికి సంబంధించి తుడా నిధులు వినియోగిస్తామని వివరించారు. స్వర్ణముఖి ఆధునీకరణలో ప్రస్తుతం దేవాదాయశాక శివం టు శివం రోడ్డు పనులు చేపట్టారని దానికి అనుబంధంగా తుడా కూడా నిధులు కేటాయించి పనులు చేపడతామని వివరించారు.

# ప్రతి పిహెచ్‌సిలో ఎన్‌సిడి సెల్ ఏర్పాటు : కలెక్టర్



వైద్యాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్

చిత్తూరు, జులై 25 ప్రభాత వార్త: జిల్లాలోని ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎన్‌సిడి సెల్ ఏర్పాటు చేసుకోవడానికి కార్యాచరణ సిద్ధం చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ భవనంలో శుక్రవారం జిల్లా వైద్యశాఖ, చిత్తూరు సిఎంసి ఆధ్వర్యంలో పేదలకు ఉచితంగా అందిస్తున్న వైద్య సేవలపై కలెక్టర్ సుమిత్‌కుమార్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ నాన్ కమ్యునికల్ డిసీజెస్ కంట్రోల్ ప్రొగ్రామ్ అంటువ్యాధి లేని జవనశైలి వ్యాధులు దేశ ప్రజారోగ్య వ్యవస్థకు అనారోగ్యం అన్నారు. అలాగే ఇవి మరణాలు, ఆర్థిక భారంను కల్గిస్తున్నాయన్నారు. వయస్సు, ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా జనాభాలోని అన్ని వర్గాల్లో అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, శారీరక వ్యాయామం లేకపోవడం జీవనశైలి వ్యాధుల పెరుగుదలకు దోహదపడ్డాయన్నారు. 30-70 సంవత్సరాల మధ్య వయస్సు గల ఉత్పాదక వయస్సు గల వారిలో మొత్తం మరణాల్లో 52 శాతం ఎన్‌సిడి యొక్క ఏదో ఒక కారణం వల్ల సంభవిస్తున్నాయని గణంకాలు వెల్లడిస్తున్నాయన్నారు. 30 సంవత్సరాలు పైబడిన జనాభాకు వారి వ్యాధి పరిస్థితులతో సంబంధం లేకుండా నాన్ కమ్యూనికల్ వ్యాధుల కోసం స్క్రీనింగ్, ఎన్‌సిడిలతో గుర్తించబడిన వారందరికీ ఉచిత మందుల సరఫరా చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమం జిల్లాలో అమలులో భాగంగా చిత్తూరు సిఎంసి, అపోలో హాస్పిటల్ ఆధ్వర్యంలో త్వరలో సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలోని ఎఎన్ఎంలు, మెడికల్ ల్యాబ్ టెక్నిషియన్లు, ఇతర వైద్య సిబ్బందికి ఎన్‌సిడిపై అవగాహన కల్పించాలని కలెక్టర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. అలాగే ప్రతి పిహెచ్‌సిలో సిరిక్స్ హెల్త్‌కేర్ పరికరాలు పనిచేస్తున్నాయా! లేదా! అని డిఎంహెచ్ఓ కచ్చితంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. అలాగే సిఎంసి ఆధ్వర్యంలో హెచ్‌డబ్ల్యుసి, పిహెచ్‌సిల్లో టెలి కన్సల్టెంట్స్ ఎలా నిర్వహిస్తున్నారు! జిల్లా వైద్య సిబ్బంది ఎసైతం ఇలాగే శిక్షణా కార్యక్రమాలను డిఎంహెచ్ఓ ఆధ్వర్యంలో చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో డిఎంహెచ్ఓ డాక్టర్ సుధారాణి, డిసిహెచ్ఎస్ డాక్టర్ పద్మాంజలి, సిఎంసి ఆసుపత్రి ప్రతినిధి డాక్టర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

## ఆటో మ్యుటేషన్‌పై పక్కాగా అవగాహన : జిల్లా రిజిస్ట్రార్

చిత్తూరు, జులై 25 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో ఆటో మ్యుటేషన్ విధానంను అమలు చేయనుందని, ఈ విషయంపై ప్రతి ఉద్యోగి అవగాహన పెంచుకోవాలని జిల్లా రిజిస్ట్రార్ వెంకటరమణమూర్తి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో ఆగస్టు 1వ తేదీ నుండి ఆటో మ్యుటేషన్ విధానం అమలు చేయనుండటంతో ఈ విషయంపై మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్‌తో కలిసి జిల్లా రిజిస్ట్రార్ వెంకట రమణమూర్తి శుక్రవారం గిరింపేట రిజిస్ట్రేషన్ కార్యాలయంలో మున్సిపల్ అధికారులు, డాక్యుమెంటేషన్ రైటర్లు, రిజిస్ట్రేషన్ అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

### అమర ఆసుపత్రిలో...
# అంతర్జాతీయ బ్రెయిన్ డే



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

రేణిగుంట జూలై 25 ప్రభాతవార్త :రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ అమర ఆసుపత్రి నందు శుక్రవారం అంతర్జాతీయ బ్రెయిన్ డే సందర్భంగా విశిష్ట అతిథులతో ప్రత్యేక సెమినార్ జరిగింది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్, ఈఎస్ఐసి జాయింట్ డైరెక్టర్ రాధాకృష్ణ, రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు, ఐఎంఏ అధ్యక్షులు ఆర్ఆర్ రెడ్డి, ఆర్టీవో మురళీమోహన్, అమర ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ గౌరనేని వరప్రసాద్, మేనేజింగ్ డైరెక్టర్ రమాదేవి గౌరనేని,తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి సెమినార్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ మెదడు శరీరంలో రారాజు లాంటిది అన్నారు. మెదడును జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు. బిపి, డయాబెటిస్, థైరాయిడ్, క్రియాటినిన్ లాంటి వ్యాధులు రాకుండా సరైన పోషక విలువలు కలిగిన ఆహారం భుజిస్తూ క్రమ పద్ధతిలో వ్యాయామం చేయాలన్నారు. వ్యాధులు సంక్రమిస్తే వాటిని మందుల ద్వారా అదుపులో పెట్టుకోవాలన్నారు. రుచిగా ఉంది కదా అని మోతాదుకు మించి భుజిస్తే శరీరంలో కొవ్వు పెరిగి బ్రెయిన్ స్ట్రోక్, బ్రెయిన్ లో క్లాట్లు వచ్చే అవకాశం ఉందన్నారు. ఒక్కోసారి స్ట్రోక్ వల్ల ప్రాణాలు పోవచ్చని లేనిపక్షంలో పక్షవాతం రావచ్చని తెలిపారు.ఈ సందర్భంగా డాక్టర్ వరప్రసాద్ గౌరినేని, రమాదేవి గౌరినేని సంయుక్తంగా పాత్రికేయులతో మాట్లాడుతూ అమర ఆసుపత్రిలో మెదడుకు సంబంధించిన సర్జరీలు చేయడానికి వైద్య నిపుణులు ఉన్నారన్నారు. చికిత్స కోసం వచ్చిన రోగులకు చెన్నై తదితర ప్రాంతాల్లోని కార్పొరేట్ ఆసుపత్రులతో పోల్చుకుంటే ఎంతో తక్కువ ఖర్చుతో వైద్యం చేస్తున్నామన్నారు. ఒక్కసారి బ్రెయిన్ స్ట్రోక్ వస్తే మెదడులో స్ట్రోక్ గురైన భాగంలో జీవ కణాలు మరణిస్తాయన్నారు. మరణించిన జీవకణాలు తిరిగి జీవం పోసుకో పోయినా స్ట్రోక్ ప్రభావం ఇతర కణజాలాలపై పడకుండా సర్జరీ,మందుల ద్వారా అడ్డుకట్ట వేయవచ్చు అన్నారు. వీటిని నయం చేయడానికి డాక్టర్ రమాదేవి గౌరినేని స్లీప్ వెల్ మెడిసిన్ నందు నిపుణులని డాక్టర్ గౌరినేని వరప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో సిసిఓ భాగ్యలక్ష్మి, శ్రీధర్ న్యూరాలజీ హెచ్ఓడి లు డాక్టర్ ఆనంద్, డాక్టర్ యశ్వంత్ సందీప్, డాక్టర్ విజయేందర్ రెడ్డి, డాక్టర్ అనిల్ బాబు, క్రిటికల్ కేర్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇక... ఆ కాటేజీలు కనుమరుగు !

**-ఆధ్యాత్మికభావంతో అత్యాధునికంగా నిర్మాణాలు**



ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల: తిరుమలకు వస్తున్న భక్తుల సంఖ్య లక్షమంది వరకు చేరడం...వసతి కోసం 7,600 గదులు మాత్రమే లభ్యత ఉండటంతో పాతబడిన విశ్రాంతి గృహాలు, కాటేజీలను తొలగించాలనే నిర్ణయానికి టిటిడి పాలక మండలి ఆమోదముద్ర వేసింది. సామాన్యభక్తులకు వసతికల్పించలేని దుస్థితిలో ఉన్న పలు విశ్రాంతి గృహాలు, కాటేజీలను పూర్తిగా పడగొట్టి వాటి స్థానంలో దాతల సహకా రంతో అత్యాధునికంగా ఆధ్యాత్మిక భావంతో నూతనంగా నిర్మించాలని అనుమతించారు. దాతలు వీలైనంత త్వరగా ముందుకు వస్తే పాతభవనాలను పడగొట్టే పనులు కూడా మొదలవుతాయి. వాటి స్థానంలో నూతన భవనాలకు భూమిపూజ చేసేందుకు కూడా పాలకమండలి ఆమోదం తెలిపింది. పలు కాటేజీలు, విశ్రాంతి గృహాలు చాలావరకు కాలం చెల్లిపోవడం, పెచ్చులూడిపడి సీలింగ్‌లు ఊడిపో వడం, వర్షమొస్తే ధారాళంగా నీరు గదుల్లోకి చేరడం వంటి చేదు అనుభవాలు భక్తులు చవిచూస్తున్నారు. అనేక కాటేజీల గదుల్లో దాదాపు నల్లులు, దోమలు, మంచాలు కూడా సరిగా లేకపోవడం అనే ఫిర్యాదులు ఉన్నాయి. కొన్ని విశ్రాంతి గృహాలు పూర్తిగా పాతవి కావడం, గోడలు, గదులు పెచ్చులూడే దుస్థితికి చేరాయి. టిటిడి పాలక మండలి హెచ్‌విడిసి కాటేజీల్లో ఆరు బ్లాక్‌లు, పద్మావతి విచారణ కార్యాలయం పరిధిలోని బాలాజీ విశ్రాంతి గృహం, ఆంధ్రో అతిధి గృహం, డిఎంబి రోడ్డులోని కల్యాణకట్ట మార్గంలో ఉన్న అన్నపూర్ణ క్యాంటీన్ భవనం, కల్యాణిసత్రాలను ఐఐటి నిపుణుల సూచనలతో పూర్తిగా తొలగించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ విశ్రాంతి గృహాలు, కాటేజీలు పూర్తిగా పడగొట్టి దాతలను ప్రోత్సహించి కొత్తగా ఒక్కో కాటేజీలో 12వరకు గదులు ఉండేలా,పూర్తిస్థాయిలో పార్కింగ్ సౌకర్యం కల్పించేలా నిర్మాణాలు చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించారు. రానున్న మూడునాలుగు నెలల్లో చాలావరకు ఈ విశ్రాంతి గృహాలు, కాటేజీలు పూర్తిగా తొలగించి అద్భుతంగా నిర్మించేందుకు టిటిడి చైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఈఓ శ్యామలరావు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి స్పష్టమైన ఆదేశాలిచ్చారు. నూతనంగా నిర్మించదలచిన కాటేజీలు, విశ్రాంతిగృహాలను భక్తిభావంఉట్టిపడేలా దాతలు చూడాలని ప్రణాళికలు తయారుచేశారు. సామాన్యభక్తులు బసచేసే 50 రూపాయలు, 100 రూపాయలు నుండి వెయ్యిరూపాయల వరకు ఉన్న పలు కాటేజీలు కొత్తగా నిర్మాణం కానున్నాయి.

# స్మార్ట్ మీటర్లుతో అదనపు భారం పడదు!

**- ఏపి ఎస్పీడిసిఎల్ సిఎండి కె.సంతోషరావు**



తిరుపతిరూరల్, జూలై 25 ప్రభాతవార్త: విద్యుత్ స్మార్ట్ మీటర్లపై ఎలాంటి అపోహాలకు తావులేదని ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణి సంస్థ (ఏపి ఎస్పీడిసిఎల్) చైర్మెన్ మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు అంశంపై వినియోగదారులు గందరగోళానికి గురి కావాల్సిన అవసరం లేదని, స్మార్ట్ మీటర్లు ద్వారా వినియోగదారులపై ఎటువంటి అదనపు భారం పడబోదని వివరించారు. కేంద్ర ప్రభుత్వ విద్యుత్ పంపిణి పునర్ వ్యవస్థీకరణ పథకం (ఆర్‌డిఎస్ఎస్)లో భాగంగా అన్ని రాష్ట్రాలు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఏ.పి.లో స్మార్ట్ మీటర్ల ప్రతిపాదనలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ నియంత్రణా మండలి (ఏపిఇఆర్సీ) 2021 ఫిబ్రవరిలో అమోదం తెలిపిందన్నారు. ఈ మేరకు సంస్థ పరిధిలో ప్రభుత్వ వాణిజ్య సర్వీసులకు స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ సర్వీసులతో పాటు విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉన్న గృహ వినియోగదారులకు కూడా స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ మీటర్లు అమర్చే ముందు వాటి ప్రత్యేకతలు ప్రయోజనాలపై వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటుకు వినియోగదారులు ఎలాంటి రుసుం చెల్లించనవసరం లేదని తెలిపారు. విద్యుత్ నెలవారీ బిల్లులతో పాటు స్మార్ట్ మీటర్లకు సంబందించి ఎలాంటి అదనపు చార్జీలు వసూలు చేయమని తెలిపారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో విద్యుత్ బిల్లులు పెరుగుతాయనేది కేవలం అపోహ మాత్రమే అన్నారు. స్మార్ట్ మీటర్ల కన్స్యూమర్ యాప్ ద్వారా వినియోగదారులు విద్యుత్ వినియోగాన్ని ఎప్పటికపుకపడు పర్యవేక్షించు కోవచ్చునని, తద్వారా బిల్లును నియంత్రించుకునేందుకు అవకాశం ఉంటుందని తెలి పారు. అంతేకాకుండా వినియోగదారులకు అవసరమైన వివిధ అలర్ట్స్‌ను ఎప్పటికప్పుడు అందుకోవచ్చునని తెలిపారు. స్మార్ట్ మీటర్లు ద్వారా విద్యుత్ బిల్లులను నేరుగా వినియోగదారుల మొబైల్‌కు చేరుతాయని, అందులో బిల్లు వివరాలు సవివరంగా తెలుసుకోవచ్చునని వివరించారు. ఏపి ఎస్పీడిసిఎల్ టోల్ఫ్రీ నెంబర్ 1912కు వినియోగదారులు కాల్ చేయడం ద్వారా స్మార్ట్ మీటర్ల అంశంపై సందేహాలను నివృత్తి చేసుకోవచ్చునని సూచించారు.

# కల్తీ నెయ్యి అంటూ... దీపాలపై ఆంక్షలు!

**-ఆలయం లోపల దీపాలు వెలిగిస్తుంటే కట్టడి ఏదీ**
**- తిరుమల తరహా పర్యవేక్షణ ఎక్కడ**
**- ఇఓ, డిప్యూటీ ఇఓ మధ్య కొరవడి సమన్వయం**



సప్తమాతృకల విగ్రహాల వద్ద దీపాలు వెలిగిస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి,జూలై 25 ప్రభాతవార్త శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తులు దీపాలు వెలిగించడంపై కల్తీ నెయ్యి అంటూ దీపాలు వెలిగించడంపై ఆంక్షలు విధించారు ఆలయాధికారులు. శ్రావణ మాసం, కార్తీక మాసాల్లో ఆలయాల్లో దీపాలు వెలిగించడం భక్తులకు ఆనవాయితీ. ప్రపంచ ప్రసిద్దిచెందిన దేవాలయాల్లో ముఖ్యంగా శివాలయాలకు వచ్చే భక్తులు దీపం వెలిగించాలన్నది వారి మనోభావం. కానీ శ్రీకాళహస్తీశ్వ రాలయాధికారులు మాత్రం వ్యాపారులు కల్తీ నెయ్యి విక్రయిస్తున్నారని 'దీపాల వెలిగింపైనే ఆంక్షలు విధించారు. అయితే ఆలయం లోపల దీపాలు వెలిగిస్తున్న భక్తులను కట్టడి చేయలేకపోతున్నారు. ఆలయ ఇఓ, డిప్యూటీ ఇఓలు ఆలయ కార్యాలయానికే పరిమితమై, ఆలయ పరిసరాలపై పర్యవేక్షణ కొరవడుతున్నది. ఇక సిబ్బంది, సెక్యూరిటి, హోంగార్డులు ఆలయ పర్యవేక్షణ కానీ ఫలితం శూన్యం

**భక్తుల మనోభావాలపై లేదు శ్రద్ధ:**

సాధారణంగా శివాలయానికి వచ్చే భక్తులు దీపం వెలిగించాలని భావిస్తారు. అందుకే కార్తీక మాసంలో శివాలయాలు దీపాల కాంతితో కళ కళ లాడుతాయి. ఈ నేపధ్యంలోనే శ్రీకాళహస్తీశ్వరాలయంలో కూడా కార్తీక మాసం ఆలయాధి.కారులు రంగుల గోపురం శివయ్య గోపురం మధ్య దీపాలు వెలిగించుకొనుటకు అవకాశం కల్పించారు. అయితే తరువాత దీపాల వెలిగింపుపై ఆంక్షలు విధించారు. కారణం ఏ రాజకీయ శక్తి అధికారులను శాసించిందో ఏమో కానీ ససేమిరా అంటున్నారు. ఎవరైనా సరే శివాలయంలో దీపం వెలిగిస్తే మంచిదని భావిస్తారు.కానీ ఎందుకో శ్రీకాళహస్తీశ్వరాలయాధికారులు పట్టించుకోవటం లేదు. అయితే ఆలయం లోపల సప్తమాతృకల ఆలయం పక్కన భక్తులు దీపాలను వెలిగిస్తున్నా,పట్టించుకునే దిక్కులేదు.

**వ్యాపారులను కట్టడి చేయలేరా?**

శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తులను వ్యాపారస్తులు కల్తీ నెయ్యిని అందించి భక్తులను దోపిడి చేస్తున్నారనే నెపంతో దీపాల వెలిగింపునే ఆంక్షలు విధించి వెలిగించకుండా చేసారు. అయితే వ్యాపారులను కట్టడి చేసే సామర్థ్యం దేవస్థానంకు పోలీసులకు లేదా? శ్రీకాళహస్తీశ్వరాలయం వద్ద సుమారు 200 మంది సెక్యూరిటి, హోంగార్డులు ఉన్నారు. మరి వేకువ జామున వారికి డ్యూటీలు వేసి భక్తులను మోసం చేసే వ్యాపారులపై చర్యలు తీసుకోవచ్చు కదా. మరి కార్తీక మాసం వస్తుంది! మరి అప్పుడు ఏం చేస్తారు? అనే చర్చ జరుగుతుంది.రాత్రంతీ రాజగోపురం, బిక్షాల గాలిగోపురంల వద్ద సెక్యూరిటి కాపలా ఉంటున్నారు కాదా, వారి ద్వారా సమాచారం తీసుకొని భక్తులను మోసం చేసే వ్యాపారులపై చర్యలు తీసుకోవచ్చు కదా? అలాంటి విధానాలకు స్వస్తి చెప్పి భక్తుల మనోభావాలను దెబ్బతీయటం ఎంత వరకు సమంజసమనే చర్చ జరుగుతుంది. శ్రీకాళహస్తీశ్వరాలయానికి సమీపంలో వందలాది మంది వ్యాపారులు జీవనం గడుపుతున్నారు. కొందరు వ్యాపారుల ధనదాహం అందరు వ్యాపారులకు శాపంగా మారింది. అయితే దీనిని కట్టడి చేయాల్సిన అధికారులు పాలకులు దీపాలే నిషేధం అంటూ భక్తుల మనోభావాలపై దెబ్బతీయటం గమనించదగ్గ విషయం. ఈ సమస్యను దీపాల వ్యాపారులు పలుమార్లు శాసనసభ్యుని కలసి తమ జీవనంపై దెబ్బతీస్తున్నారని మొరబెట్టుకున్నారు, కానీ ప్రయోజనం లేదు.

### వర్గ పోరు వద్దు...
# తెలుగు తమ్ములందరికి ఒకటే గొడుగు

**నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి ముందువుంటాను - టీడీపీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ శంకర్‌రెడ్డి**



మండలంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో శంకర్‌రెడ్డి, నాయకులు

- టీడీపీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ శంకర్‌రెడ్డి

సత్యవేదు, జూలై 25 ప్రభాతవార్త: తెలుగు తమ్ములు అందరూ ఒకే గొడుగు కింద పని చేయాల్సిందేనని సత్యవేదు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ శంకర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం అలిమేలు మంగాపురం, కన్నవరం, అల్లపుగుంట, జడేరి తదితర గ్రామాల్లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో టీడీపీ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్‌రెడ్డి అధ్యక్షతన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా శంకర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీలో ఇకపై గ్రూపులకు తావు లేదన్నారు. ఏదైనా సమస్య తలెత్తితే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని తెలియజేశారు. ప్రధానంగా నియోజకవర్గంలో పార్టీ బలోపేతంతో పాటు అభివృద్ధి కూడా తన ముందున్న కర్తవ్యం అన్నారు.ఈ నేపథ్యంలో తాను పర్యటిస్తున్న గ్రామాల్లో అంతా పసుపు మయంగా మారుతున్నట్లు ఆయన గుర్తు చేశారు. ధ్వంసమైన వెంకటరాజుల కండ్రిగనుంచి టీపీ పాళెం, టీపీ కోట రోడ్డు బాగు కోంస ఒక కోటి 50 లక్షలు మంజూరు కాగా టెండర్ దశలో ఉందన్నారు. అలాగే అల్లపుగుంట రోడ్డు బాగు కోసం ఒక కోటి 30 లక్షలు మంజూరై టెండర్లు కూడా పూర్తి కావడంతో త్వరలోనే పనులు ప్రారంభమవుతుందన్నారు. దీంతో పాటు టీపీ పాళెం, చిన్నపాండూరు కొత్త రోడ్డుకు సంబంధించి ప్రతిపాదనలను ముఖ్యమంత్రికి సమర్పించామన్నారు. అంతకు ముందు పార్టీ ఆయన టీడీపీ నాయకులతో కలసి ఏఎం పురం చేరు కోగా బాణసంచా పేలుళ్ళు, డప్పు వాయిద్యాల మధ్య స్వాగతం పలికి శాలువ కప్పి గజమాలతో సత్కరించారు. తదనంతరం స్థానిక టీడీపీ నాయకులు మాజీ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, చిట్టి రెడ్డి, కోటి రెడ్డి, దాము యాదవ్, సుబ్రమ్మణ్యం రెడ్డి, దాము రెడ్డి, సాయికుమార్ తదితరులతో కలసి మహిళలు పెద్ద ఎత్తున పూలవర్షం కురిపిస్తుండగా శంకర్‌రెడ్డి ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందించి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించడంతో పాటు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కన్నవరం, అల్లపుగుంట, జడేరి గ్రామాల్లో సుపరిపాలన తొలి అడుడు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే హేమలత, నాయకులు పరమశివం, మస్తాన్, సుందరరామిరెడ్డి, సతీష్ నాయుడు, తిరుమలరెడ్డి, పద్మనాభరాజు, గిరిబాబు, ఆరె జయరాం రెడ్డి, నరేంద్ర, మురళి(చికెన్ చిన్న), శశిమోహన్,జనసేన రూపేష్ పాల్గొన్నారు.

## టీచర్ల జీతాల సమస్యకు సత్వర పరిష్కారం

– నేడు డిఇఓ కార్యాలయం ఎదుట యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిరసన

**చిత్తూరు, జులై 25 ప్రభాతవార్త:** గత రెండు నెలలుగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న జీతాల సమస్యలను సత్వరం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర యుటిఎఫ్ నాయకత్వం పిలుపు మేరకు శనివారం సాయంత్రం 5 గంటలకు చిత్తూరు డిఇఓ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర యుటిఎఫ్ కార్యదర్శి జివి రమణ తెలిపారు. టీచర్ల బదిలీలు జరిగి రెండు నెలలు కావస్తున్నప్పటికీ పొజిషన్ ఐడిల కోసం క్యాడర్ స్ట్రెంత్ ఫైల్ ఇంత వరకు ఆమోదం పొందలేదన్నారు. గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో చర్చించి ఆమోదం తెలుపుతామని చెప్పి మంత్రి వర్గంలో ఈ విషయంను ప్రస్తావించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు సిఎం వద్దకు ఇందుకు సంబంధించిన ఫైల్ వెళ్ళలేదని, ఈ పరిస్థితుల్లో ఉపాధ్యాయుల జీతాల సమస్య మరింత జాప్యం అయ్యే అవకాశం కన్పిస్తోందన్నారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున టీచర్లు హాజరు కావాలని జిల్లా నాయకులు సోమశేఖర్‌నాయుడు, మణిగండన్‌లు పిలుపునిచ్చారు.

## మంచినీటి సమస్య పరిష్కారంకు చర్యలు

– డివిజన్లలో పర్యటించిన కమీషనర్ నరసింహప్రసాద్



**చిత్తూరు, జులై 25 ప్రభాతవార్త:** డివిజన్ల పరిధిలో మంచినీటి సమస్య ఉత్పన్నం కాకుండా ఎప్పటి కప్పుడు పరిశీలించి పక్కాగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ అధికారులను ఆదేశించారు. కమీషనర్ నరసింహ ప్రసాద్ శుక్రవారం శంకరయ్యగుంట, అంబేద్కర్‌నగర్, అశోక్‌పురం, టాప్‌లైన్ ప్రాంతాల్లో పర్యటించారు. శంకరయ్యగుంటలో స్థానికులు మంచినీటి సమస్యతో ఇబ్బందులు వున్నాయని కమీషనర్ దృష్టికి తీసుకురాగా కమీషనర్ ఇంజనీరింగ్ అధికారులతో అక్కడికక్కడే చర్చించి నీటి సమస్యను పరిష్కరించడానికి బోరు డ్రిల్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌ఓ డాక్టర్ లోకేష్, వార్డు కార్యదర్శులు వున్నారు.

## గోల్డెన్ జూబ్లీ అంతర్జాతీయ సదస్సుకు త్రిపుర గవర్నర్



**తిరుపతి హెల్త్, జులై 25 ప్రభాతవార్త :** తిరుపతిలోని ఎస్.వి ఎమ్‌సీ క్యాంపస్‌లోని డాక్టర్ ప్రేమ్ సాగర్‌రెడ్డి భవనంలోని ఎస్.వి ఎంసీఏఏ భవనంలో శుక్రవారం నుంచి ఈనెల 27వ తేది వరకు వైద్య, ఆరోగ్యశాస్త్రాలలో ఇటీవల పురోగతిపై అంతర్జాతీయ గోల్డెన్ జూబ్లీ సమావేశం జరుగు తోంది. ఈ కార్యక్రమ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హిజ్ ఎక్సలెన్సీ ఎన్.ఇంద్రసేనరెడ్డి త్రిపుర గవర్నర్, గౌరవ అతిథి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం ఎమ్మెల్సీ, జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఏపీ మెడికల్ కౌన్సిల్ ఛైర్మన్ డాక్టర్ డి. శ్రీహరిరావు, ఎస్‌వీఎంసీ ప్రిన్సిపాల్ తిరుపతి డాక్టర్ జి.రవి, ఎస్.వి ఎంసీఏఏ ఆర్గనైజింగ్ కమిటీ ఛైర్మన్ డాక్టర్ రాయపు రమేష్ బాబు పలువురు ప్రముఖులు హాజరైప్రారంభించారు.

## ఏడాది పాలనకు ప్రజలు ఆశీర్వాదం

– సుపరిపాలనలో మంత్రి నిమ్మల



**తిరుపతి, జులై 25ప్రభాతవార్త:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సంవత్సరం పాలనపై ప్రజలందరూ కూడా ఆశీర్వాదాలందిస్తున్నారని రాష్ట్రమంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ప్రజల తలరాతలు మార్చే నాయకుడు చంద్రబాబు నాయుడు అని అన్నారు. అయితే ప్రాణాలు తీసే వ్యక్తి జగన్‌అని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో ఎక్కడకు వెళ్ళి ఏ గడపతొక్కినా ప్రజలు పరిపాలన బాగుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో తిరుపతి నియోజకవర్గంలో శుక్రవారం ఉదయం ఇన్‌ఛార్జి ఎం.సుగుణమ్మతో కలసి మంత్రి రామానాయుడు చింతలచేను వద్ద పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ప్రజలతో మమేకమై వారినుండి సమస్యలు తెలుసుకున్నారు. ప్రధాని మోదీ సహకారంతో మంత్రి నారాలోకేశ్ సారథ్యంలో రాష్ట్రం అభివద్ధిలో కొత్తపుంతలు తోక్కుతుందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నరసింహయాదవ్, పుష్పావతి యాదవ్, సూరాసుధాకర్‌రెడ్డి, శ్రీధర్‌వర్మ, ఆర్‌సి మునికృష్ణ, విజయకుమార్, వట్టికుంట చిన్నబాబు, కంకణాలరజినీకాంత్‌నాయుడు, మన్నెంశ్రీనివాసులు, బుల్లెట్‌రమణ, దంపూరి భాస్కర్‌యాదవ్, సదాశివం, ఊకా విజయకుమార్, ఆర్‌పి శ్రీనివాసులు, బివి కీర్తి ,పాతకం వెంకటేశ్, హేమంత్‌రాయల్, పాల్గొన్నారు.

## ముగిసిన ఆడికృత్తిక మహోత్సవాలు



**శ్రీకాళహస్తి, జులై 25 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరా లయంలో జరుగుతున్న ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి పల్లకి సేవ అంగరంగ వైభవంగా నిర్వహించారు. సోమవారం పల్లకి సేవ రావటంతో భక్తులు షణ్ముఖుని మనసారా దర్శించు కున్నారు. ఆలయంలోని అలంకార మండపంలో వల్లిదేవ సేన సమేత సుబ్రమణ్యం స్వామిని కన్నులు మిరుమిట్లు గొల్పునట్లు అలంకార గురుకుల్ రాజేష్, సూరిలో ముస్తాబు చేసారు. ఉత్సవంతో పాటు టెంపుల్ ఇన్సెపెక్టర్లు వెంకటస్వామి,సియస్‌ఓ నాగభూషణం యాదవ్, హారతులిచ్చి గ్రామోత్స వానికి సాగనంపారు. పల్లకిలో వల్లిదేవసేనసమేత సుబ్రమణ్యం స్వామి రాగా పల్లకి సేవ ప్రారంభమైంది.

## కామన్ వేడి నీళ్ళ స్నానపు గదులు క్లోజ్



**తిరుమల, జులై 25ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలో సామాన్యభక్తులకు వేడినీళ్ళు అందించే కామన్‌స్నానపుగదులు మూతబడ్డాయి. ఈ గదులు గత నెలరోజులుగా తెరచుకోలేదు. పైగా వీటిని వినియోగంలోకి తీసుకురాక మూతబడటంతో ధుమ్ముపట్టి దుర్వాసన వెదజల్లుతోంది. సామాన్యభక్తులు బసచేసే 50 రూపాయలు అద్దె గదులు ఉంటే కాటేజీలకు అనుబంధంగా తిరుమలలో కామన్‌స్నానపుగదులు వేడినీళ్ళు లభ్యమయ్యేలా కొన్నేళ్ళపాటు నిర్వహించారు. ఇప్పుడు మూతబడటంతో రోజువారీగా భక్తులు వచ్చి చూసి వెనుదిరుగుతున్నారు. గదుల్లో చల్లనినీటిని వాడుకోలేక ఈ వేడినీళ్ళ గదులను వినియోగించుకునేవారు. మరీ ఇలా ఎస్‌ఎన్‌సి ప్రాంతంలో ఉన్న వీటిని ఎందుకు మూసేశారో తెలియక భక్తులు అయోమయంలో ఉన్నారు.

## అలిపిరి తనిఖీ కేంద్రానికి ఆధ్యాత్మిక శోభ

-విస్తరణ పనులు మొదలు



**తిరుమల, జులై 25ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలకు ప్రతినిత్యం లక్షమందివరకు వస్తున్న భక్తులు తొలుత ప్రవేశించే ప్రధాన ద్వారం అలిపిరి తనిఖీ కేంద్రానికి ఆధ్యాత్మిక శోభ తీసుకువచ్చే పనులు మొదలయ్యాయి. అంతేగాక ఈ తనిఖీకేంద్రం మార్గాలను కూడా విస్తరిం చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. తిరుమల క్షేత్ర వైభవాన్ని అలిపిరిలోనే భక్తులు తెలుసుకునేలా బేస్ క్యాంప్ ఏర్పాటుతో బాటు మహామండపంలోకి వచ్చేలాగా అనుభూతి కలిగించేలా తనిఖీ కేంద్రంలో కొత్త డిజైన్లతో మార్పులు చేయనుంది. ఇందులో భాగంగా భక్తులు నడిచే పుట్‌పాత్‌ల తరహాలోని దిన్నెలను పూర్తిగా సిమెంట్‌తో ఉన్నవాటిని తొలగించి అందంగా మొజాక్‌టైల్స్ ఏర్పాటుచేస్తున్నారు. వాహనాల్లో వస్తున్న భక్తులు ఇక్కద దిగి తమ లగేజీలను తనిఖీ చేసుకుంటారు. ఇందుకు సులభంగా ఉండేందుకు మొజాక్‌టైల్స్ అమర్చేపనులు చేస్తున్నారు. బేస్‌క్యాంపు ఏర్పాటులో కూడా భాగంగా పనులు చురుగ్గా సాగుతున్నాయి.

## వీధంతా రొచ్చు... రోడ్డు వేయండి మహా ప్రభు



**పుంగనూరు రూరల్, జులై 25, ప్రభాతవార్త** పట్టణంలోని 3వ వార్డు, రాగానిపల్లె మార్గమధ్యంలోని శాంతినగర్ మొదటి వీధిలో రోడ్డు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నపాటి వర్షం పడినా రోడ్డు పూర్తిగా మట్టిలో మునిగిపోతుందని, నడవడానికి కూడా వీలులేకపోతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మురుగు నీరు నిలిచిపోవడం వల్ల దోమలు పెరిగి, జ్వరాలు వ్యాపించే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు.

## నెహ్రూ రికార్డు కూడా మోదీ అధిగమించాలి



**పుంగనూరు, జులై 25 ప్రభాతవార్త :** ప్రధానిగా మోడీ నెహ్రూ రికార్డు కూడా అధిగమించాలని, మరింత కాలం దేశంలో రామ రాజ్యపాలన సాగించాలని బిజెపి పట్టణ అధ్యక్షుడు జగదీష్ రాజు కోరారు. శుక్రవారం పట్టణంలో మోడీ రికార్డు సంబరాలు నిర్వహించుకున్నారు. బిజెపి నాయకులు మాట్లాడు తూ ఇందిరాగాంధీ పేరుతో ఉన్న రికార్డును మోదీ అధిగమించి ఉన్నత పాలనకు ప్రపంచానికి మార్గ దర్శకం చేశారన్నారు. 4,078 రోజులు పూర్తి అయిన మోడీ పాలనలో దేశం అగ్రస్థానానికి చేరుతుం దన్నారు. కేక్ కట్ చేసి సంబరాలను నిర్వహించుకున్నారు. పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం



**పూతలపట్టు, జులై ప్రభాతవార్త :** సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పూతలపట్టు మండలం, పోటు కనుమ గ్రామం ఎగువ హరిజనవాడలో మండల మాజీ ఎస్సి సెల్ అధ్యక్షులు సుబ్బరాజులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బరాజు మాట్లాడుతూ ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందిచడమే కూటమి ప్రభుత్వం ధ్యేయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రామ కమిటీ అధ్యక్షులు ఎల్. నటరాజ్ నాయుడు, సాగునీటి సంఘం అధ్యక్షులు బి. యువరాజులు నాయుడు, బూత్ కమిటీ కన్వీనర్ ఆర్. సురేష్ నాయుడు, మాజీ సర్పంచ్ ఎం.బాలాజీ. చిట్టిబాబు నాయుడు, చెంగాల్ రాయులు, పి.అంజి, టి.భాస్కర్, పి.వెంకటస్వామి ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు.

## నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు : కమీషనర్



**పలమనేరు, జులై 25 ప్రభాతవార్త:** పలమనేరు మున్సిపల్ ప్రజలకు అందించే నీటి సరఫరా కేంద్రాలను శుక్రవారం మున్సిపల్ కమీషనర్ రమణారెడ్డి ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. పట్టణంలోని నాగమంగళం వద్ద ఉన్న నీటి సరఫరా కేంద్రాని ఆయన పరిశీలించారు. సిబ్బంది ఎప్పటికప్పుడు నీటి సరఫరా వివరాలను నమోదు చేపట్టాలని, పట్టణంలోని ఓవర్ హెడ్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని, క్లోరిన్ టెస్టులు చేపట్టాలని సూచించారు. ప్రజలకు తాగు నీటి సరఫరాలో నిర్లక్ష్యం వద్దని సిబ్బందికి సూచించారు. అనంతరం జిల్లా బిసి కార్పొరేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో వెలుగు భవనంలో నిర్వహిస్తున్న టైలరింగ్ శిక్షణా కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మిథున్‌రెడ్డి అరెస్టు కక్ష్యపూరిత చర్య : వైకాపా



**చౌడేపల్లి, జులై 25 ప్రభాతవార్త :** ఎంపి పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి అరెస్టు కూటమి ప్రభుత్వ కక్ష్యపూరిత చర్యని వైకాపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జడ్పీటీసీ నడింపల్లి దామోధర్‌రాజు, మండల పార్టీ అధ్యక్షుడు గౌడప్పగారి నాగభూషణరెడ్డిలన్నారు. ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని మద్యం కుంభకోణం కేసులో అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపిస్తూ స్థానిక వైఎస్సార్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన జరిగింది. వైకాపా రాష్ట్ర, మండల నాయకులు కళ్యాణ్‌భరత్, మిద్దింటి శంకరనారాయణ, కూరపర్తి అంజిబాబు, రుక్మిణమ్మ, నరసింహులు యాదవ్, సుధాకర్‌రెడ్డి, పవన్‌రాయల్, హరీష్‌రాయల్, శ్రీరామ్ అరుణ్ రాయల్, నున్నా భాస్కర్, అల్తాఫ్, చెంగారెడ్డి, కరణంవారిపల్లి గిరి, జంగాలపల్లి రమణ, రాజశేఖర్‌రెడ్డి, కాటిపేరి రంగా, తొండా శ్రీరాములు, వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## అమ్మవార్ల ఆలయాల్లో విశేష పూజలు



**చౌడేపల్లి, జులై 25 ప్రభాతవార్త :** శక్తిస్వరూపిణీ బోయ కొండ గంగమ్మ, పుదిపట్ల స్వయంభు వైష్ణవీదేవి ఆలయా ల్లో శుక్రవారం విశేష పూజలు జరిగాయి. గంగమ్మ ఆల యంలో దంపతుల సమక్షంలో రాహుకాలాభిషేకం నిర్వ హించారు. పాత కళ్యాణకట్ట వద్ద ఉచిత అన్నదాన శిబి రాన్ని ఏర్పాటు చేసారు. ఇఒ, ఉపకమీషనర్ ఏకాంబ రం భక్తులకు సేవలందించారు. ఆలయ నిర్మాణదాత వినోద్‌కుమార్‌రెడ్డి పవిత్ర తీర్థ ప్రసాదా లందించారు.

## పాడిరైతుల అభివృద్ధి కోసమే గోకులంషెడ్లు : గువ్వల

**చౌడేపల్లి, జులై 25 ప్రభాతవార్త :** పాడిరైతుల అభివృద్ధి కోసమే గోకులంషెడ్ల నిర్మాణాలను కూటమి ప్రభుత్వం చేపడుతోందని మండల తేదేపా అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి(చిట్టి)అన్నారు. పుంగనూరు టిడిపి బాధ్యుడు చల్లా రామచంద్రారెడ్డి వినతి మేరకు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ మండలానికి రూ. 2.25కోట్లతో 100గోకులంషెడ్లు మంజూరయ్యాయన్నారు. పాడిరైతులుసద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. చల్లాబాబు, రమేష్‌రెడ్డిలకు రైతులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

## భవనంపై నుంచి పడిగాయపడ్డ వ్యక్తి మృతి



**రామకుప్పం, జులై 25 ప్రభాతవార్త:** స్థానిక దిగువ వీధిలో ప్రమాదవశాత్తు ఇంటిపై నుంచి పడి గాయాలపాలైన వ్యక్తి మృతి చెందాడు. రామకుప్పంకు చెందిన దొరస్వామిశెట్టి కుమారుడు మునిరత్నం స్థానిక శివాలయం వీధిలో తన సొంత ఇంట్లో నివాసం ఉంటున్నాడు. సోమవారం రాత్రి భోజనానంతరం మొదటి అంతస్తులో వాకింగ్ చేస్తూ ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. దీంతో తీవ్రంగా గాయపడ్డ అతన్ని కుప్పం పిఇఎస్‌కు ఆపై తమిళనాడులోని కృష్ణగిరి అనంతరం తిరుపతి స్విమ్స్ ఆస్పత్రికి తరలించారు. కాగా మునిరత్నం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు రామకుప్పం పోలీసులు కేసు నమోదు చేశారు.

## క్షయవ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి : డిప్యూటీ డిఎంహెచ్‌ఒ



**వి.కోట, జులై 25 ప్రభాతవార్త :** క్షయవ్యాధి నిర్మూలనకు వైద్య, ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ వెంకట ప్రసాద్ సూచించారు. శుక్రవారం ఓగు పిహెచ్‌సి కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గళ్ల పరీక్షల నిర్వహణ, రికార్డుల గురించి అడిగి తెలుసుకున్నారు. 0-40ఏళ్లలోపు వారికి సెకెల్ సెల్ టెస్ట్ చేయాలన్నారు. ఇందులో పాజిటివ్ వస్తే నెలకు పదిహేను వేలు డబ్బులు అందుతాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మాధవి, డాక్టర్ విజయకాంత్, డాక్టర్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## వెదురుకుప్పాన్ని తిరుపతి జిల్లాలో చేర్చాలి



**వెదురుకుప్పం, జులై 25 ప్రభాతవార్త :** మండలంను తిరుపతి జిల్లాలో చేర్చాలని భారతీయ జనతా పార్టీ, జనసేన పార్టీ నాయకులు డిప్యూటీ తహశీల్దార్ ఈశ్వర్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మండల భారతీయ జనతాపార్టీ అధ్యక్షులు బోడిరెడ్డి అశోక్‌రెడ్డి మాట్లాడుతూ వెదురుకుప్పం మండల ప్రజలకు జిల్లాల పునర్విభజనలలో తీవ్ర నష్టం జరిగిందన్నారు. మండల కేంద్రం నుంచి తిరుపతికి 30 కిలోమీటర్లు ఉండగా చిత్తూరుకు సుమారు 45 కిలోమీటర్లు ఉంటుందన్నారు. నిత్యం రైతులు తాము పండించిన కూరగాయాలు, పండ్లు. పూలు తదితర వస్తువులు మార్కెటింగ్ చేయడంకు తిరుపతికి వెళ్ళడం జరుగుతుందన్నారు. చదువులకు కోసం విద్యార్థులు, ఇతర అవసరాలకు ప్రజలు తిరుపతికి వెళ్ళడం జరుగుతుందని పేర్కొన్నారు. సౌకర్యంగా ఉన్న తిరుపతి జిల్లాలో చేర్చకుండా సౌకర్యం లేని చిత్తూరులో చేర్చి అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందులు కల్గిజేశారని వాపోయారు. ఈ కార్యక్రమంలో జనసేన అసెంబ్లీ బూత్ కన్వీనర్ యతీశ్వర్ రెడ్డి, బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చంగారెడ్డి, బిజెపి జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి పాముల శేషాద్రి కుమార్, బిజెపి మండల ప్రధాన కార్యదర్శి గోపి, దళిత మోర్చా అధ్యక్షులు ప్రకాష్, మండల ఉపాధ్యక్షులు మోహన్ రెడ్డి, జనసేన నాయకులు చిరంజీవి, మునిరత్నం, అనిల్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు 50లక్షలు మంజూరు : కడ పి.డి



**కుప్పం, జులై 25 ప్రభాతవార్త :** మండలంలోని మల్లానూరు పంచాయతీలో అభివృద్ధి పనులకు కడ నిధుల నుంచి యాభై లక్షల నిధులు మంజూరు చేస్తున్నట్లు కడ పి.డి. వికాస్ మర్మత్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నంతో కలసి మల్లానూరులో పర్యటించారు. తొలుత సచివాలయంలో అధికారులు, స్థానిక నేతలతో సమావేశం నిర్వహించి అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం బస్‌షెల టర్, అన్న క్యాంటీన్ ఏర్పాటుకు, జూనియర్ కాలేజ్ భవనాలకై స్థలాలు పరిశీలించారు. అండర్ రైల్వే బ్రిడ్జిని పరిశీలించారు. సిఎం చంద్రబాబునాయుడు టాటా సంస్థ సహకారంతో కుప్పంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన టాటా డిజిటల్ నెర్వ్ సెంటర్ (డిఐఎన్‌సి)పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, మాజీ ఎంపిపి సాంబశివం, కడ పిఎసి సభ్యుడు రామచంద్ర, నేతలు సంతోష్, మణి, అన్నాదొరై, దామోదర్, సంజీవి, మోహన్, వల్లెప్ప, రమేష్, విభూషణ్, వెంకటప్ప, చంద్ర, తహశీల్దార్ చిట్టిబాబు, డిఇలు గురవారెడ్డి, పురుషోత్తం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా బలోపేతం చెందాలి:ఆర్టీసీ వైస్ ఛైర్మన్



**కుప్పం, జులై 25 ప్రభాతవార్త:** గ్రామాల్లో మహిళలు ఆర్థికంగా బలోపేతం చెందాలని ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. శుక్రవారం మల్లానూరు గ్రామంలో పలువురు మహిళలకు ఇ-సైకిళ్లను ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, టిడిపి మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం పంపిణీ చేశారు. మహిళలు కార్యక్రమంలో మాజీ ఎంపిపి సాంబశివం, కడ సభ్యుడు రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీపురంలో సమస్యల పరిష్కారంకు చర్యలు

– టిడిపి మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్



**కుప్పం, జులై 25 ప్రభాతవార్త:** సిఎం చంద్రబాబు నాయుడు, ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్ ఆదేశాలతో మున్సిపల్ పరిధి లక్ష్మీపురంలో తాగునీరు, డ్రైనేజ్ సమస్యల పరిష్కారంకు చర్యలు తీసుకుంటున్నట్లు టిడిపి మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ పేర్కొన్నారు. గ్రామస్తులు సమస్యలపై జననాయకుడు పోర్టల్‌లో వినతి చేయడంతో ఆయన గ్రామంలో పర్యటించారు. అధికారులు వెంటనే తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరినట్లు చెప్పారు. కార్యక్రమంలో నేతలు నారాయణ, రవి, ఉమాపతి, లోకేష్ పాల్గొన్నారు.

## వడ్డిపల్లిలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం

**కుప్పం, జులై 25 ప్రభాతవార్త:** మున్సిపల్ పరిధి ఏడో వార్డు వడ్డిపల్లిలో శుక్రవారం టిడిపి మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కు మార్, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, మాజీ సర్పంచ్ ప్రతాప్ సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు వివరించి కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో నేతలు మాణిక్యం, రాజేష్, గోపి, షణ్ముగం, నటరాజ్ పాల్గొన్నారు.



## ఫోరం కమిటీ కార్యదర్శిగా చిట్టిబాబు



**కుప్పంరూరల్, జులై 25 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎంల ఫోరం కమిటీ కార్యదర్శిగా అడవిబూదుగూరు హరిజనవాడ పాఠశాల హెచ్‌ఎం పోతుగుంట చిట్టిబాబు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రాష్ట్ర ఫోరం కమిటీ అధ్యక్షుడు సివి ప్రసాద్ ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ ఎస్టీయు జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా ఉంటూ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. తనను ఎంపిక చేసిన రాష్ట్ర కమిటీకి ధన్యవాదాలు తెలిపారు.

## పలు ఆలయాల్లో శ్రావణమాసం పూజలు

**కల్లూరు, జులై 25 ప్రభాతవార్త:** పులిచెర్ల మండలం దేవళం పేట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో శ్రావణమాసం తొలి శుక్రవారం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించి అర్చనలు పూజలు జరిపి నైవేద్యం సమర్పించి మహా మంగళహారతి గావించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. కల్లూరు విరుపాక్షమ్మ ఆలయంలో శ్రావణమాసం తొలి శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

## వైద్యుడు లేక జబ్బు పడిన ఆరోగ్య కేంద్రం



**పుంగనూరు, జులై 25 ప్రభాతవార్త :** పట్టణంలోని కొత్తపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుడు లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతు న్నారు. గత వారం రోజులుగా డాక్టర్ పోస్టు ఖాళీగా ఉండటంతో ఆసు పత్రికి వచ్చే రోగులు నిరాశతో వెనుదిరుగుతున్నారు. రోజుకు సగటున 60 మందికి పైగా రోగులు పీహెచ్సీకి వస్తున్నప్పటికీ వైద్య సేవలు అందక తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారు. శుక్రవారం కూడా పలువురు రోగులు ఆసుపత్రి ప్రాంగణంలో గంట ల తరబడి వేచి ఉన్నారు. కానీ డాక్టర్ లేనందున ఎలాంటి వైద్యం జరగలేదు. ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లడం అందరికి సాధ్యపడక, డబ్బుల సమస్యలతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పీహెచ్సీ లోవైద్యసిబ్బందిఉన్నా, వైద్యుల అభావంతో వారు సేవలు అందించలేకపోతున్నారు.

## ప్రతీదీ ప్రభుత్వమే చేయదు: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



**శ్రీకాళహస్తిరూరల్, జులై 25 ప్రభాతవార్త:** ప్రభుత్వం చేయాల్సిన, చేపట్టాల్సిన కార్యక్రమా లను చేపడుతుంది. అయితే ప్రతిదీ ప్రభుత్వమే చేయాలనే ఆలోచన ఉండకూడదని ప్రజలు కూడా జవాబుదారి తనంతో వ్యవహరించాలని శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి, తుడా ఛైర్మెన్ డాలర్ దివాకర్‌రెడ్డిలు అన్నారు. శుక్రవారం శ్రీకాళహస్తి మండలంలోని కమ్మకొత్తూరు గ్రామంలో ఏర్పాటు చేసిన తొలిఅడుగు బహిరంగ సభకు చుట్టు పక్కల గ్రామాల నుంచికూడా ప్రజలు హాజరయ్యారు. నాయకులు సభకు ముందు గ్రామంలోని వీధి వీధిలో తిరిగి అభివృద్ధిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంఎల్ఏ మాట్లాడుతూ ఏడాదిలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రైతులకు సాగునీరందించటానికి ఎన్నో ప్రణాళికలతో ముందుకు వెళ్ళాము. రైతులు వేసిన పంటలు ఎండకుండా సాగునీరందించామన్నారు. ఇక్కడి చెరువు గొలుసు చెరువుల్లో ఉన్న పెద్ద చెరువుల్లో ఒకటిగా ఉందన్నారు. ఈ సభలో మాజీ శ్రీకాళహస్తి వ్యసాయమార్కెట్ కమిటి ఛైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు, కృష్ణమనాయుడు, తాటిపర్తి రవీంద్రరెడ్డి, విజయకుమార్ తదితరులు ఎపాల్గొన్నారు.

## అంతా నాకే తెలుసునని ఊబిలో పడుతున్నారు



**శ్రీకాళహస్తి, జులై 25 ప్రభాతవార్త:** సాంకేతిక పరిజ్ఞానం రోజు రోజుకు జెట్ స్పీడ్‌తో పరుగులు తీస్తుందని అయితే మనిషి తనకు సర్వం తెలుసుననే అజ్ఞానంతో ఊబిలో ఇరుక్కుంటున్నారని హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్ సాహెబ్ అన్నారు. శుక్రవారం జామియా మస్‌జిద్‌లో ప్రత్యేక ప్రార్థనల తరువాత ఆయన దివ్యఖుర్ ఆన్‌లోని అంశాలను వివరిస్తూ ఏ పని అయినా సమస్యతో కూడుకున్నదన్నారు. అలాగే ఇస్లాం మత ఆచరణకూడా కష్ట సాధ్యమైనదే అయితే ఆచరిస్తే అంతసులభమైన అంశం మరొకటి లేదన్నారు. తనకు ఏం తెలియదనే భావంతో సాధన చేయాలన్నారు.

## పార్టీని బలోపేతం చేయాలి

-రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్‌కుమార్



**తొట్టంబేడు, జులై 25 ప్రభాతవార్త:** కేంద్రంలో నరేంద్రమోదీ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను, రాష్ట్రాభివృద్ధికి అపారంగా నిధులు అందిస్తున్న ప్రధాని నరేంద్రమోదీ ఉదారతను ప్రజలకు తెలియ జేయాలని రాష్ట్ర బిజెపి కార్యదర్శి కోలా ఆనంద్‌కుమార్ అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. శ్రీకాళహస్తిలో బిజెపి పార్టీ బలంగా సభ్యత్వ కలిగి వుందని అయితే రాబోవు రోజుల్లో మన సత్తా చాటుకోవాల్సి ఉందన్నారు. డైనమిక్ నాయకుడు ఎంఎల్ఏ బొజ్జల సుధీర్‌రెడ్డి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడపటంలో తమదైన శైలిలో అధికారులను పరుగులు తీయిస్తున్నారని ప్రజలకు జిల్లా కమిటిలో శ్రీకాళహస్తి నియోజకవర్గానికి చెందిన 9మందికి అవకాశం కల్పించటం గమనించదగ్గ విషయం అన్నారు. బిజెపి జిల్లా కార్యవర్గంలో శ్రీకాళహస్తికి చెందిన వారికి పదవుల అవకాశం లభించింది. ఉపాధ్యక్షుడుగా మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బిడిబాలాజి, అధికార ప్రతినిధిగా కొండేటి గోపాల్, కార్యదర్శిగా మునీశ్వరి, కార్యవర్గ సభ్యులుగా లింగాబత్తిన గోపాల్, యతీందర్‌రెడ్డి, రమణారెడ్డిలకుఅ వకాశం కల్గిందని సమావేశంలో కోలా ఆనంద్‌కుమార్ పరిచయం చేసారు. కాగా శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో అభివృద్ధి కమిటిలో అవకాశం లభించిన గరికపాటి రమేష్‌బాబులను సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో హరిష్‌రెడ్డి, ఏడం కృష్ణయ్య, భగీర్తి వెంకటేష్, పూజారి ప్రేమ్‌కుమార్‌రెడ్డి, ధర్మయాదవ్, కూనాటి నాగరాజు, కుమార్ నాయుడు, తొనికొండల భరత్‌నాయుడు, యుగంధరన తదితరులు పాల్గొన్నారు.

## డాలర్‌ను సత్కరించిన దేశం నాయకులు



**శ్రీకాళహస్తిరూరల్, జులై 25 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి నియోజకవర్గంలో సమస్యలను పరిశీలించి తమ పరిధిలోని మున్సిపాలిటిలో అభివృద్ధికి తుడా నిధులను మంజూరు చేయుటకు క్షేత్రస్థాయిలో చూడటానికి వచ్చిన తుడా ఛైర్మెన్ డాలర్ దివాకర్‌రెడ్డిని శుక్రవారం మండలం లోని ఊరందూరు గ్రామంలోని తమ సొంత ఇంటిలో శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి సత్కరించారు. దివాకర్‌రెడ్డి ఇక్కడకు రాగానే మొదట బొజ్జల బృందమ్మచే ఆశీర్వచనాలు అందుకున్నారు. అల్పాహార విందు తరువాత ఆయన్ను శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి, మార్కెటింగ్ కమిటి మాజీ ఛైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు, ఏర్పేడు మండల సీనియర్ నాయకుడు పొన్నారావు, తొట్టంబేడుకు చెందిన కన్నల ప్రతాప్‌రెడ్డి దివాకర్‌రెడ్డి ని ధుశ్శాలువతో సత్కరించారు.

## తెలుగుదేశంలోని బిసిలకు సముచిత స్థానం



**శ్రీకాళహస్తి, జులై 25 ప్రభాతవార్త:** ఆది నుంచి బిసిలకు అండగా నిలిచింది తెలుగుదేశం ప్రభుత్వమే అని బిసి నాయకులు శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బిసి విభాగం డాక్టర్ ఎం.ఉమేష్‌రావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆర్‌టిసి విశ్రాంత ఉద్యోగి కె.రామచంద్రయ్య, తొమ్మిదవ వార్డు అధ్యక్షునికిగా నిమమించిన సందర్భంగా సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర కార్యదర్శిడాక్టర్ జి.దశరధాచ్చారి, మిన్నల్ రవి, మహబూబ్‌బాషా, వజ్రం కిషోర్, కోట చంద్రశేఖర్, సయ్యద్ చాన్‌బాషా, బీమాల భాస్కర్‌ముదిరాజ్, సంజాకుల మురళి కృష్ణ, మణి, కృష్ణమూర్తి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## చెరువు ఆక్రమణపై రెవెన్యూ అధికారులు కొరడా



**రేణిగుంట జూలై 25 ప్రభాతవార్త :** రేణిగుంట మండలం వెంకటాపురం పంచాయతీ అన్నసంపల్లె గ్రామ లెక్క దాఖలు సర్వే నంబర్ 380 నందు 65.5 సెంట్ల చెరువు భూమి రేణిగుంట తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి తమ సిబ్బందితో ఆక్రమణ నుండి శుక్రవారం విముక్తి కలిగించారు. ఇరిగేషన్ శాఖకు చెందిన చెరువు భూమి ఆక్రమించుకొని ఆ స్థలంలో దాదాపు 27 రేకుల షెడ్లు నిర్మించి ఉండడాన్ని రెవెన్యూ అధికారులు గుర్తించారు. సదరు షెడ్లను తహసిల్దార్ పోలీస్ బందోబస్తుతో ఇరిగేషన్ అధికారుల సమక్షంలో జెసిబిలను ఉపయోగించి తొలగించారు. స్థలాన్ని చెరువుకు సంబంధించిన ఇరిగేషన్ అధికారులకు అప్పగించారు.తప్పనిసరి పరిస్థితుల్లో ఆక్రమణలను తొలగించామన్నారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురైతే ఉపేక్షింపమన్నారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శలు



**నారాయణవనం, జూలై 25 ప్రభాతవార్త :** సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం శుక్రవారం పిచ్చాటూరు, నాగలాపురం మండలంలో చనిపోయిన టిడిపి బాధిత కుటుంబాలను పరామర్శించారు. బాధిత కుటుంబాలను పరామర్శించి బాధితులను ప్రభుత్వ పరంగా ఆదుకుంటానన్నారు. ముందుగా పిచ్చాటూరు మండలం వేలూరు గ్రామానికి చెందిన శరవణన్(46) బుధవారం కరెంట్ షాక్‌తో మృతి చెందారు. ఆ కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామన్నారు. అనంతరం నాగలాపురంకు చెందిన అక్బర్ భాషాను ఆదుకోవడం కోసం ప్రభుత్వం మంజూరు చేసిన సిఎం రిలీఫ్‌ఫండ్ 75వేల రూపాయాల చెక్కును అందించారు. అలాగే నాగలాపురం మండలం ఎస్సీ సెల్ టిడిపి నాయకులు శ్రీధర్ తండ్రి మృతి చెందారు. ఆయన మృతదేహానికి సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయనతో పాటు టిడిపి నాయకులు ఇళంగోవన్‌రెడ్డి, సెల్వరాజ్,పద్దురాజు,ఎస్‌ఎంసురేష్,,ఐటిడిపివెంకటేష్‌పలువురుసీనియర్ టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## ఎర్రచందనం కేసులో నలుగురికి ఐదేళ్ల జైలు శిక్ష



**నారాయణవనం (పిచ్చాటూరు), జూలై 25 ప్రభాతవార్త :** సత్యవేడు నియోజకవర్గం పిచ్చాటూరు మండలంలోని రెప్పాలపాటు వద్ద 2018, డిసెంబర్ 25వ తేది ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో పట్టుబడ్డ నలుగురికి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు 3లక్షల రూపాయాల జరిమాన ం కోర్టు విధించడం జరిగిందని పిచ్చాటూరు ఎస్ఐ వేంకటేశ్ తెలిపారు. ఈ దాడిలో తమిళనాడుకు చెందిన ఎం భాస్కర, పుగయాండి, ప్రభు, జాకీర్ హుస్సెన్‌లను అరెస్టు చేశారు. ఈ కేసు ఎర్రచందన ం ప్రత్యేక కోర్టు జడ్జి ఎ.నరసింహమూర్తి తీర్పు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ వెంకటరెడ్డి, సిబ్బంది దేవరాజు, కవి అరసన్, వెంకట్రాదిలు పాల్గొన్నారు.

## మేక్ ఇన్ ఇండియాకు కొత్త శకం

**తిరుపతి విద్య, జూలై 25 ప్రభాతవార్త:** భారత ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమం మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం యుకెఎస్‌ఎఫ్‌కు కొత్త శకం కానుందని టివిఎస్ మోటర్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ సుదర్శన్ వేణు తెలిపారు.శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ,వికసిత్ భారత్ లక్ష్యం ప్రేరణనిచ్చిందన్నారు. ఇండియా యుకె స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకం చేయడం ఒక కీలకమైన క్షణమని తెలిపారు. ప్రపంచ స్థాయి ఉత్పత్తులు, బ్రాండ్లను నిర్మించాలనే సంకల్పాన్ని బలపరుస్తుం దన్నారు.

## శ్మశానం, మైదానానికి స్థలం మంజూరు చేయించండి

**సత్యవేడు, జూలై 25 ప్రభాతవార్త:** క్రీడా మైదానానికి స్థలం ఇప్పించాలని సత్యవేడు మండలం మదనంబేడు యువకులు, పలువురు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ శంకర్‌రెడ్డికి విన్నవించారు. శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి శంకర్‌రెడ్డి ఏఎం పురం వెళుతూ మార్గమధ్యంలో మదనంబేడు గ్రామం వద్ద ఆగారు. ఈ నేపథ్యంలో శ్మశానం, క్రీడాకారుల సౌకర్యార్థం స్థలం ఇప్పించాలని యువకులు కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నరేంద్ర,మురళి(చికెన్ చిన్న), గురునాథం, దయ, జనసేన నాయకుడు రాజేష్ తదితరులు ఉన్నారు.

## గ్రూపు రాజకీయాలకు స్వస్తి...అభివృద్ధికి నాంది

– పార్టీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ శంకర్‌రెడ్డిన



**కేవీబీ పురం, జూలై 25 ప్రభాతవార్త:** సత్యవేడు నియోజకవర్గంలో గ్రూపు రాజకీయాలకు స్వస్తి పలికి అభివృద్ధికి నాంది పలకాలని సత్యవేడు తెలుగుదేశం పార్టీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ శంకర్‌రెడ్డి అన్నారు. కేవీబీపురం మండల కేంద్రంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని పార్టీ మండల అధ్యక్షుడు రామాంజుల నాయుడు, రాష్ట్ర బీసీసెల్‌ప్రధాన కార్యదర్శి, కేవీబీ పురం మండల క్లస్టర్‌ఇన్‌చార్జి మునస్వామి యాదవ్, రైతు అధ్యక్షుడు గోపినాథ్‌రెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించారు. సత్యవేడు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే హేమలత ముఖ్య అతిథులుకు వచ్చిన వారికి కేవీబీ పురం మండల ప్రజలు డప్పు వాయిద్యాలతో పూలవర్షం కురిపించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కూరపాటి శంకర్‌రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమ వైపు నడిపిస్తూ ప్రజలందరికి రక్షణ కల్పించడమే కూటమిప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే హేమలత, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, జిల్లా రైతు అధ్యక్షుడు కనపర్తి గోపినాథ్‌రెడ్డి, రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి మునస్వామి యాదవ్, టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు తెరణి, జయరాంరెడ్డి, నియోజకవర్గ యువత అధ్యక్షుడు లక్ష్మీపతిరాజు, నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు సాధు, తిరుపతి పార్లమెంట్ యువత అధికార ప్రతినిధి సురేష్‌రెడ్డి, బీజేపీ అధ్యక్షుడు బాబుయాదవ్, వెంకట కృష్ణయ్య, సురేష్, వెంకటేష్, ప్రశాంత్, అఖిల్, మధుయాదవ్, మునికృష్ణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా పార్టీ అధ్యక్షుడు పుట్టిన రోజు వేడుకలు



**కేవీబీపురం, జూలై 25 ప్రభాతవార్త:** కేవీబీపురంలో తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రామాంజులనాయుడు పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం కేవీబీ పురంలోని సాయిబాబా గుడి వద్ద పేద బడుగు, రామాంజులనాయుడు 73వ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, టపాసులు పేల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు ఏ.శివరావు, తిరుపతి జిల్లా రైతు కమిటీ అధ్యక్షుడు గోపినాథ్‌రెడ్డి, సత్యవేడు నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు సాధు, పార్లమెంట్‌యువత కార్యదర్శి అవసరం సురేష్‌రెడ్డి, జనసేన మండల అధ్యక్షుడు థామస్, వెంకటేష్, చంద్ర నాయుడు, ప్రశాంత్, విమల్, స్టాలిన్, నాగరాజు, రమేష్, బాబ్జి, మాధవ్ రెడ్డి, కొండారెడ్డి, మాజీ ఎంపీపీ మణి, బాలాజీ, వెంకట్‌రెడ్డి, రామరాజు, మండల టీడీపీ అధ్యక్షురాలు పావని, ముకేష్, అఖిల్,చంద్ర, మునికృష్ణ, మనోహర్,తరుణ్,సతీష్,పాపయ్య, సింసన్ మండలంలోని తెలుగుదేశం బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## జగనన్న కాలనీలో అధికారుల పర్యటన



**శ్రీకాళహస్తిరూరల్.జూలై 25 ప్రభాతవార్త :** గత వైకాపా హయాంలో ఊరందూరుకు సమీపంలో చేపట్టిన జగనన్న కాలనీని శుక్రవారం రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ శివప్రసాద్ అధికారులతో కలసి పరిశీలించారు. శుక్రవారం ఈ కాలనీ క్షేత్ర స్థాయిలో పరిస్థితి ఏమిటన్న అంశాన్ని రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ శివప్రసాద్ అధికారులతో ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా ఆయన్ను కలసిన విలేకరులతో మాట్లాడుతూ జగనన్న కాలనీలో లబ్దిదారులు ఇబ్బంది పడకుండా పనులు పూర్తి చేయుటకు ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఇక్కడ కనీస మౌళిక సదుపాయాల్లేనందువల్ల లబ్దిదారులు ముందుకు వచ్చి ఇళ్ళు నిర్మించు కోలేదన్నారు. ఆయనతో పాటుపిడి దయాకర్,ఇఇ శ్రీనివాసులు,డిఇ మోహన్‌రావు, ఎఇఇ రమణయ్య ఇంజనీరింగ్ సిబ్బంది కాంట్రాటక్టర్లు పాల్గొన్నారు.

## క్రిమినల్ కేసు...ఎంఆర్‌ఓ వద్ద బైండోవర్!

**తొట్టంబేడు,జూలై 25 ప్రభాతవార్త:**

శ్రీకాళహస్తి పట్టణంలోని విఎంసి సర్కిల్ వద్ద ఉన్న ఆర్ ఆర్ సినిమా థియేటర్‌లో హరిహర వీరమల్లు విడుదల సందర్భంగా ఫ్యాన్స్ షోలో కొందరు ఆకతాయిలు అల్లరి సృష్టించి, గొడవలు పడి థియేటర్ అద్దాలను పగులగొట్టి రభస సృష్టించిన ఫిర్యాదు మేరకు దాడి చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసామని వారిని తహాశీల్దార్ వద్ద బైండోవర్ చేసామని వన్‌టౌన్ సిఐ డి.గోపి శుక్రవారం తెలిపారు. వీరమల్లు సినిమా విడుదల సందర్భంగా ఈ నెల 23న రాత్రి ఫ్యాన్స్ షో సందర్భంగా కొందరు యాజమాన్యం పట్ల అసభ్యంగా ప్రవర్తించి పబ్లిక్ న్యూసెన్స్ సృష్టించి థియేటర్ మేయిన్ డోర్ అద్దాలు ధ్వంసం చేసారని థియేటర్ మాజమాన్యం ఫిర్యాదు చేసినట్లు సిఐ గోపి వివరించారు. అనవసరంగా న్యూసెన్స్ క్రియేట్ చేస్తే సహించేది లేదని సిఐ హెచ్చరించారు.

## సిఎంఆర్ ఎఫ్ చెక్కుల పంపిణి



**తిరుపతి విద్య, జూలై 25 ప్రభాతవార్త:** సీఎం ఆర్ ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు గురువారం తన నివాసంలో అందచేశారు. 20వ డివిజన్ పరిధిలోను ఎంఆర్ పల్లి కి చెందిన ఇ.పుష్పమికి రూ.3 లక్షల 39 వేల 154 రూపాయల చెక్ ను ఎమ్మెల్యే అందించారు. అలాగే 44వ డివిజన్ పరిధిలోని మధురానగర్ కు చెందిన ఏ.లలిత కు 41వేల 112రూపాయల చెక్ ను ఎమ్మెల్యే అందించారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు రవి,ముని ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు టేప్ ఎక్స్పో 25 ఎగ్జిబిషన్



**తిరుపతి హెల్త్, జూలై 25 ప్రభాతవార్త :** తిరుపతి పట్టణ ప్రజలు భవన నిర్మాణం అవగాహన కోసం ఎయిర్‌బైపాస్ రోడ్డులోని పీఎల్‌ఆర్ కన్వెన్షన్ హాల్ నందు ఎక్స్పో 25 ఎగ్జిబిషన్ ఈ నెల 26,27వ తేదీల్లో ది అసోసియేషన్ ఆఫ్ ప్లానర్స్ అండ్ ఇంజనీర్స్ ఆధ్వర్యంలో ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు టేప్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మట్టి ప్రసాద్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి రెవెన్యూ, రిజిస్ట్రేషన్ స్టాంప్స్ మంత్రి కొల్లు రవీంద్ర, రవాణాశాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, చిత్తూరు ఎంపీ వరప్రసాద్, తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు, పలువురు ప్రముఖులు హాజరు కానున్నారని తెలిపారు.అసోసియేషన్ చైర్మన్ టి. వెంకటేష్ బాబు, జనరల్ సెక్రటరీ బుసా షణ్ముగం, ట్రెజరర్ సందీప్, వైస్ ప్రెసిడెంట్లు నాగేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ బంగారయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ నరేష్, వెల్ఫేర్ సెక్రటరీ సురేష్ పాల్గొన్నారు.

## గిరిజనుల సంక్షేమ కోసం నిరంతరం కృషి చేస్తా!



**రేణిగుంట జూలై 25 ప్రభాతవార్త :** గిరిజనుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని గిరిజన ప్రజా సమాఖ్య, గిరిజన విద్యార్థి సమాఖ్య జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టి కమిషన్ మాజీ సభ్యులు ఒడిత్యా శంకర్ నాయక్ అన్నారు. రేణిగుంట విమానాశ్రయ సమీపంలోని అక్షయ క్షేత్రంలో విభిన్న ప్రతిభావంతుల నడుమ ఒడిత్యా శంకర్ నాయక్ జన్మదిన వేడుకలు శంకర్ షాలిని ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఒడిత్యా శంకర్ నాయక్ విభిన్న ప్రతిభావంతుల మధ్య కేక్ కట్ చేసి వారి చేత తినిపించారు. అక్షయ క్షేత్ర నిర్వాహకులు ఆయనను ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన విభిన్న ప్రతిభావంతులకు పండ్లు, పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో యువజన అధ్యక్షులు హనుమంత నాయక్, చిత్తూరు జిల్లా అధ్యక్షులు మంజు కుమార్ నాయక్, తిరుపతి జిల్లా అధ్యక్షులు తేజ నాయక్, శంకర్ నాయక్ అభిమానులు పాల్గొన్నారు..

## తుడా సహకారంతో మండలంలో అభివృద్ధి వేగవంతం



**రేణిగుంట జూలై 25 ప్రభాతవార్త :** రేణిగుంట మండలం తారకరామా నగర్ నందు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, తుడా చైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి ఏ డే విత్ తుడా చైర్మన్ లో భాగంగా చేయాల్సిన అభివృద్ధిపై విస్తృతంగా పర్యటించారు. కరకంబాడి క్లస్టర్ ఇంచార్జ్ బుజ్జి నాయుడు ఆధ్వర్యంలో మహిళలు వీరికి అపూర్వ స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే, తుడా చైర్మన్ సంయుక్తంగా మాట్లాడుతూ తారక రామా నగర్ అభివృద్ధికి 1.5 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేస్తామన్నారు. తారకరామ నగర్ ప్లాంటేషన్ ద్వారా పచ్చదనంతో కళకళలాడేలా చేస్తామన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని అన్నారు. అర్హులైన అందరికీ మూడు సెంట్ల ఇంటి స్థలాలు మంజూరు చేస్తామన్నారు. తుడా అప్రూవల్ లేని లేఅవుట్లను తొలగిస్తామని తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి హెచ్చరించారు. మండలంలో గతంలో జరిగిన ఆక్రమణలను ఉపేక్షింపమని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని, తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డిని బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ కుమార్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి బీడీ బాలాజీ, బిజెపి మండల అధ్యక్షుడు పూజారి ప్రేమ్ రెడ్డి, బిజెపి యువ నాయకులు రాజా రాయల్ తదితరులు కట్ట పుట్టాలమ్మ గుడి వద్ద మర్యాదపూర్వకంగా కలిసి తమ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో తారక రామానగర్ క్లస్టర్ ఇంచార్జ్ బుజ్జి నాయుడు, రేణిగుంట టిడిపి మండల అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి,తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సుబ్రహ్మణ్యంరెడ్డి, బి పుష్ప నాదం, నాదముని రెడ్డి, ముచ్చెలి భాస్కర్ రెడ్డి, అగ్రహారం భాస్కర్ రెడ్డి, భాస్కర్ యాదవ్, కె.వి.చలం, కొరియర్ రవి, తదితర పార్టీ నేతలతో రేణిగుంట తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీడీవో ప్రభురావు, అర్బన్ సీఐ జయచంద్ర, మండలానికి చెందిన వివిధ శాఖల అధికారులు, టిడిపి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పే కమిషన్ చైర్మన్ ను నియమించాలి



**రేణిగుంట, జూలై 25 ప్రభాతవార్త :** రేణిగుంట (తిరుపతి) సి ఆర్ ఎస్ మెయిన్ గేట్ వద్ద విశ్రాంత ఉద్యోగులు (పెన్షనర్స్) గురువారం 8వ పే కమిషన్ చైర్మన్ ను నియమించాలని పెద్ద ఎత్తున ధర్నా చేశారు. రైల్వే శాఖ అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ విశ్రాంత ఉద్యోగులు ర్యాలీతోపాటు మానవహారం నిర్మించారు. విశ్రాంత ఉద్యోగుల కనీస అవసరాలు తీర్చాలంటూ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిరసన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఆర్‌ఆర్‌ఎఫ్ బ్రాంచ్ కార్యదర్శి విజయ్ కుమార్, దాస్, కేకే రెడ్డి, మోహన్, మనోహరం, రవి, జబ్బర్, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు. రేణిగుంట బస్టాండ్ కోడల్లో రైల్వే శాఖ అవలంబిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ విశ్రాంత ఉద్యోగుల కార్యదర్శి జయంత్ కుమార్, చైర్మన్ అసం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన జరిగింది.

## ఆండాల్ అమ్మవారి నీరాట్టు ఉత్సవం

**నారాయణవనం, జూలై 25 ప్రభాతవార్త :** ఆడినెలలో ప్రారంభమయ్యే ఆండాల్ అమ్మవారి తిరువాడిపుర ఉత్సవాలు శుక్రవారం ఏడవ రోజు కూడా ఘనంగా సాగింది. నారాయణవనం మేజర్ పంచాయతీలో వెలసిన టిటిడి ఆలయం పద్మావతీదే సమేత కల్యాణ వేంకటేశ్వరుని ఆలయంలో కొలువుదీరిన ఆండాల్ అమ్మవారి నీరాట్టు ఉత్సవంను టిటిడి అధికారులు ఘనంగా నిర్వహిస్తున్నారు. గత నాలుగు రోజులుగా సాయంత్రం అమ్మవారిని తిరుచ్చివాహనంపై అధిరోహించి గ్రామ వీధుల్లో ఊరేగిస్తున్నారు. భక్తులకు టిటిడి అధికారులు ప్రసాదాలను అందించారు.

## ద్విచక్ర వాహనం చోరీపై ఫిర్యాదు

**విజయపురం, జూలై 25 ప్రభాతవార్త:** మండలంలోని కేశవపురంలో గురువారం రాత్రి టీఎన్20 సీహెచ్ 4056 హీరో హోండా ఫ్యాషన్‌ప్రో ద్విచక్రవాహనం చోరీకి గురైందని శుక్రవారం ఎస్ఐ మహేష్‌బాబుకు బాధితుడు రఘు ఫిర్యాదు చేశారు. గ్రామంలో తరచూ గొర్రెలు, మోటారు వైర్లు చోరీకి గువుతున్నాయని, ఈ విషయమై నిఘా ఉంచాలని కోరారు.

## చంద్రయ్య మృతి టీడీపీకి తీరని లోటు



**విజయపురం, జూలై 25 ప్రభాతవార్త:** టీడీపీ సీనియర్ నాయకుడు చంద్రయ్య మృతి పార్టీకి తీరని లోటని చిత్తూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి నల్లపనేని చినబాబు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పన్నూరు సబ్‌స్టేషన్‌లో ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చిత్తూరు పార్లమెంట్ కార్య నిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యం రాజు, మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, సింగిల్ విండో అధ్యక్షుడు బాబుయాదవ్, తెలుగు మహిళా అధ్యక్షురాలు గుణభూషణమ్మ, నాయకులు శివయ్యానాయుడు, సుధానాయుడు, గుణశేఖర్‌రెడ్డి, శివలింగం, బెంజిమన్, ఆర్ముగంరెడ్డి, సెల్వం,జయరాజ్, రవిచంద్ర, మురళి, పలువురు టీడీపీ నేతలు సంతాపం వ్యక్తం చేశారు.

## బ్రహ్మోత్సవాలకు వాహనాలు సిద్ధం

**పుత్తూరు రూరల్, జూలై 25 ప్రభాతవార్త:** పుత్తూరు పట్టణంలోని ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాలకు వాహనాలు సిద్ధం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఈ నెల 30వ తేదీ బుధవారం ఉదయం విఘ్నేశ్వర పూజ వాస్తు శాంతి కలశ స్థాపన,అంకురార్పణ కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానుంది. అలాగే ఆలయ ఆవరణలో మహాభారతం హరికథ కార్యక్రమం కూడా నిర్వహిస్తున్నారు. ఈ నెల 30 తేదీ నుంచి ఆగస్టు 11 తేదీ వరకు బ్రహ్మోత్సవాలునిర్వహించనున్నట్టు ఆలయ కోవిల్ సాల్వాకం కిష్టప్ప మొదలి తెలిపారు. ఆలయ ఆవరణలో మహాభారతం హరికథ కార్యక్రమం భక్తులకు ఆకట్టుకుంటుంది.

## ఎస్ఐఆర్ ఎన్నికల ప్రజాస్వామ్యానికి ప్రమాదం



**పుత్తూరు రూరల్, జూలై 25 ప్రభాతవార్త:** పుత్తూరు అంబేద్కర్ సర్కిల్ వద్ద సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఎన్నికల ప్రజాస్వామ్యానికి ప్రమాదమని దొడ్డి దారిన అమలు చేస్తున్న పౌరసత్వ చట్టం సవరణను వ్యతిరేకించండని సీపీఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు దాసరి జనార్ధన్,పుత్తూరు పట్టణ కార్యదర్శి వెంకటేష్, కార్యకర్తలు కరపత్రాలు విడుదల చేసి ఆగస్టు నెల నిరసన కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీనాయకులు విజయ్, ధన, గోవిందస్వామి, రవి, సుబ్రహ్మణ్యం, కందస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## ఏఐ ఆధారిత సంతానోత్పత్తి పరీక్ష ఫెర్టీ 9 ప్రారంభం

**తిరుపతిహెల్త్, జూలై 25ప్రభాతవార్త:** ప్రపంచ ఐవిఎఫ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం తిరుపతిలోని ఏఐఆర్ మార్గంలో ఫెర్టి9 ఫెర్టిలిటీ కేంద్రాన్ని ప్రారంభించింది. నెలాఖరులోపు ఇక్కడ వైద్యసేవలందుకునే వారికి రాయితీలు ఉంటాయని డాక్టర్ సునీత సాధు తెలిపింది. ఏఐ ఆదారిత సెమెన్ ఎనలైజర్, లెన్సాక్ ఎక్స్ 12ప్రోను పరిచయం చేస్తూ సంస్థ సంతానోత్పత్తి సంరక్షణ రంగంలో తన నూతన ఒరవడికి శ్రీకారం చుట్టిందన్నారు. ఫెర్టి 9 సహాయంతో గర్భధారణకు చేరుకని విజయవంతంగా బిడ్డను పొందిన దంపతులు ఉన్నారన్నారు. జూలై 31లోపు చికిత్సలందుకునే దంపతులకు ఐయుఐ చికిత్సపై 50శాతంచ ఐవిఎఫ్‌పై 25శాతం రాయితీ లభిస్తుందన్నారు.

# తిరుపతి డివిజన్

## శ్రావణమాసం తొలి శుక్రవారం...వేడుకగా అష్టలక్ష్మీవైభోగవ్రతం



**తిరుపతిరవాణ,జూలై 25ప్రభాతవార్త :** శ్రావణమాసం తొలిశుక్రవారం టిటిడి, హిందూ ధర్మప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో రాయలసీమ రంగస్థలి కళా సంస్థ పర్యవేక్షణలో శుక్రవారం ఉదయం రామచంద్ర పుష్కరిణిలో అష్టలక్ష్మీ వైభోగవ్రతం నిర్వహించారు. సత్యనారాయణస్వామి ఆధ్వర్యంలో జరిపించిన వైభోగవ్రతంలో విశ్వహిందూపరిషత్ రాష్ట్రఉపాధ్యక్షురాలు మురళమ్మ, వసుంధర, ప్రసన్నలక్ష్మి, గీతాంజలి,చంద్రమౌళి, రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాధరెడ్డి,తొండమనాటిసుబ్రమణ్యంరెడ్డి, కస్పా పద్మనాభం, వాసు, మురళి తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతిలో...త్రిపుర గవర్నర్



**తిరుపతిరవాణ,జూలై 25ప్రభాతవార్త :** రెండురోజుల తిరుపతి పర్యటనలో భాగంగా త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి శుక్రవారం పలువురు అభిమానులను కలుసుకున్నారు. బిజెపి న్యాయవాది అజయ్‌కుమార్ ఇంటికి చేరుకున్నారు. ఆత్మీయ అభిమానంతో స్వాగతం పలికారు. బిజెపి రాష్ట్ర అధికారప్రతినిధి, టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, అజయ్‌కుమార్, బిజెపి నాయకులు డాక్టర్ శ్రీహరిరావు, వరప్రసాద్,మునిసుబ్రమణ్యం, జల్లిమదుసూదన్ పాల్గొన్నారు

## పాశుపద అస్త్రం సాధనకై అర్జున తపస్మాన్

**రామచంద్రాపురం, జూలై 25 ప్రభాతవార్త:** చుట్టుగుంట రామాపురంలో జరుగుతున్న మహాభారత ఉత్సవాలలో భాగంగా శుక్రవారం భక్తిశ్రద్ధల నడుమ అర్జున తపస్మాన్ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వేదమంత్రోచ్చారణల నడుమ తపస్మాన్‌కు ప్రత్యేక పూజలను నిర్వహించి తపస్మాన్‌ను నిలబెట్టారు. రామాపురం గ్రామానికి చెందిన సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ కొట్టే ముద్దుకృష్ణారెడ్డి దంపతులు సంప్రదాయబద్ధంగా మేళతాళాలు మంగళవాయిద్యాలతో పూజాసామగ్రిని తమ ఇంటి వద్ద నుండి ద్రౌపధి అమ్మవారి ఆలయానికి తీసుకువచ్చి తపస్మాన్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్జునుడు వేషధారియైన ముద్దుకృష్ణారెడ్డి మెట్టు మెట్టుకు (ఒకొక్క పాట పాడుతూ) శివనామ స్మరణ గానంతో తపస్మాన్‌ను అధిరోహించారు. తపస్మాన్ నుండి విసిరే పూజా ప్రసాదం కొరకు మహిళలు, భక్తులు పెద్దఎత్తున పోటీపడ్డారు.

## టిడిపి ఎన్నికలలో ఇచ్చిన హామిలను మోసం చేసింది : ఆర్‌కె రోజా



**నింద్ర,జూలై 25 ప్రభాతవార్త :** 2024 సంవత్సరం జరిగిన సాదారణ ఎన్నికలలో టిడిపి ఇచ్చిన హామి లను పూర్తిగా మోసం చేసిందని మాజీ మంత్రివర్యులు ఆర్‌కె రోజా తీవ్రంగా విమర్శించారు.శుక్రవారం మండలంలోని మిట్టకండ్రిగ గ్రామంలో బాబు షురిటీ మోసం గ్యారంటీ కార్యక్రమానికి మాజీ మంత్రివర్యులు ఆర్‌కె రోజా ముఖ్య అతిథిగా పాల్గోన్నారు. ఈసందర్బంగా ఆమె మాట్లాడుతూ 2024వ సంవత్సరం కూటమి ప్రభుత్వం ఎన్నికల మోనిపెస్టో విడుదల చేసినప్పుడు నారా చంద్రబాబునాయుడు,పవన్‌కళ్యాన్ వీరు ఇరువురు సంతకం చేసిన మోనిపెస్టోను విడుదల చేసారని అన్నారు. మోనిపెస్టో అనేది భగత్‌గీతం,ఖురాను,బైబిల్‌గా భావించ కుండా ఒక చెత్త కాగితంగా పక్కన పెట్టెసినారని విమర్శించారని అన్నారు. కార్యక్రమంలో యంపిపి దీపాజలందం్‌రాజు, జడ్పీటిసి మల్లీశ్వరి పరందామయ్య,రాష్ట్ర యువజన కార్యదర్శి శ్యామ్‌లాల్,కో ఆప్షన్ మెంబరు అనిల్,సచివాలయ కన్వీనర్ బాబురెడ్డి,మండల కన్వీనర్ వేణురాజు,మేరీ జయరామ్, నాయ కులు రామచంద్రారెడ్డి, మల్లీఖార్జున్ నాయుడు, మురళీనాయుడు,మునిక్రిష్ణరెడ్డి, తోయజాక్షిరెడ్డి,శివలింగం ఆచ్చారి, విజేష్, సత్యరాజ్, గోపిక్రిష్ణ, నామదేవరెడ్డి, చంద్రబాబురెడ్డి, మురళీరాజు, దినకర్ పాల్గోన్నారు.

## కింగ్‌డమ్ సినిమా ట్రైలర్ ఈవెంట్‌కు అనుమతి ఇవ్వద్దు



**తిరుపతి హెల్త్, జూలై 25 :** విజయదేవర కొండ నటించిన కింగ్‌డమ్ చిత్రం ట్రైలర్ ఈవెంట్‌కు తిరుపతిలో నేడు అనుమతి రద్దు చేయాలని నిఘా నేత్ర స్టూడెంట్ ఫెడరేషన్ అధ్యక్షులు హరిప్రసాద్ నాయక్ నగర పాలక సంస్థ అధికారులను డిమాండ్ చేశారు. శుక్రవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఏప్రిల్ 26న హైదరాబాద్‌లో నిర్వహించిన హిరో సూర్య రెట్రో చిత్రం ప్రీ రిలీజ్ ఫంక్షన్‌కు హీరో విజయదేవకొండ హాజరయ్యారని తెలిపారు.ఆ ఈవెంట్‌లో అభిమానుల తోపులాటను గుర్తించిన విజయదేవరకొండ గిరిజనులను కించపరిచేలా వ్యాఖ్యానించారని విమర్శించారు. ఇటీవల ఫల్గాం సంఘటనలో దేశ ప్రజల కోసం తన ప్రాణాలను సైతం అర్పించిన మురళీ నాయక్ మా జాతి బిడ్డ అని గర్వంగా చెప్పారు.నేతలు రవీంద్రనాయక్, శివశంకర్‌నాయక్ పాల్గొన్నారు.

## శరభయ్య విగ్రహం ఏర్పాటు చేయాలి



**రేణిగుంట జూలై 25 ప్రభాతవార్త :** తిరుమల శ్రీవారిని తొలిసారి దర్శించుకున్న శరభయ్య యాదవ్ విగ్రహాన్ని తిరుమలలో ప్రతిష్టించాలని యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ కార్యదర్శి పూల వెంకటాద్రి యాదవ్ డిమాండ్ చేశారు. శ్రీ వెంకటాచల మహత్యం పురాణ ఆధారంగా వైకుంతం వదిలి భూలోకం విచ్చేసిన శ్రీ వెంకటేశ్వర స్వామిని మొట్టమొదటిసారి దర్శించుకున్న గోపాలుడు శరభయ్య అన్నారు. డిమాండ్ చేశారు.


కెనరా బ్యాంక్ केनरा बैंक Canara Bank Syndicate Together we can

(భారత ప్రభుత్వ రంగ సంస్థ)
చిత్తూరు-1 శాఖ, చిత్తూరు
చిత్తూరు జిల్లా, సెల్: 7901092637

### అమ్మకం ప్రకటన

**సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్)రూల్స్, 2002, 8(6)తో చదువబడే క్రింద స్థిరాస్తుల ఈ-వేలం అమ్మకం ప్రకటన**

ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయడమేమనగా దిగువ తెలిపిన రుణగ్రహీత(లు) మరియు గ్యారంటారు (లు) దిగువ తెలిపిన **రుణగ్రహీత శ్రీ పి.దిల్లీ కుమార్, ఎస్.మాధవన్ (గ్యారంటారు)** గార్లకు చెందిన ఆస్తులను సెక్యూర్డు క్రెడిటారుకు తనఖా/ఛార్జిలో వుంచి నిర్మితంగా **అధీకృత అధికారి, చిత్తూరు-1 శాఖ, కెనరాబ్యాంక్** వారికి బకాయి వున్న **రూ.13,79,524.88 లను+వడ్డీ మరియు ఇతర ఖర్చులను** రాబట్టుకునేందుకు స్వాధీనం చేసుకుని **"ఎక్కడ ఎలా వున్నదో అక్కడ" "అక్కడ ఎలా వున్నదో అలానే" మరియు "అక్కడ ఏమి వున్నదో అదే అనే పద్ధతిపై 28.08.2025న వేలం వేయుటకు** నిర్ణయించినారు. రిజర్వుధర, ధరావత్తు, స్థిరాస్తుల యొక్క పూర్తి వివరాలు దిగువ తెలుపడమైనది.

**స్థిరాస్తి వివరములు:-** చిత్తూరు జిల్లా నెం.74 తిమ్మసముద్రం గ్రామం, సంతపేట, దొంగలబావి వీధి, సర్వేనెం.410లో ఎ.1.78 సెంట్ల స్థలం, ఇందున వున్న డి.నెం.5-929 గల నివాసయోగ్యమైన బిల్డింగ్ (జిఎఫ్+ఎఫ్ఎఫ్+ఎస్ఎఫ్) శ్రీ ఎస్.మాధవన్ పేరున వున్నది. **పత్రం ప్రకారం (ఐటంనెం.1) హద్దులు:** తూర్పు: ఐటంనెం.2 & డి.నెం5-928 గల ఎ.ఎం.సుబ్రమణ్యం ఇల్లు, పడమర: డి.నెం.5-930, ఉత్తరం :రోడ్డు, దక్షిణం కాలువ.**పత్రం ప్రకారం (ఐటంనెం.2) హద్దులు:** తూర్పు: డి.నెం.5-928 గల ఎ.ఎం.సుబ్రమణ్యం మొదలి ఇల్లు, పడమర: ఐటంనెం.1లోని ఇల్లు, ఉత్తరం: రోడ్డు, దక్షిణం: డి.నెం.5-928 గల ఎ.ఎం.సుబ్రమణ్యం మొదలి ఇల్లు, . **కామన్ హద్దులు:** తూర్పు: డి.నెం.5-928 గల ఎ.ఎం.సుబ్రమణ్యం మొదలి ఇల్లు, పడమర: డి.నెం.5-930 గల ఇల్లు, ఉత్తరం:రోడ్డు, దక్షిణం: కాలువ.

**రిజర్వు ధర : రూ.26,18,000.00** **ధరావత్తు : రూ.2,61,800.00**

**ధరావతు సమర్పణకు ఆఖారు తేది & సమయం : 25.08.2025 సా.5.00గంIIలకు లేదా ఆలోపు.** అమ్మకానికి సంబంధించిన పూర్తి నియమ నిబంధనలు కెనరాబ్యాంకు వారి వెబ్‌సైట్ **www.canarabank.com**లోని పొందుపరిచిన "ఈ-ఆక్షన్" అను లింక్‌ను పరిశీలించ గలరు. **లేదా అధీకృత అధికారి , కెనరాబ్యాంక్, ప్రాంతీయ కార్యాలయం, తిరుపతి, ఫోన్:0877-2500130,7901092637** వారిని కార్యాలయ పనివేళలో సంప్రదించగలరు.

**ప్రదేశం:తిరుపతి, తేది: 22.07.2025** **అధీకృత అధికారి, కెనరాబ్యాంక్**

కెనరా బ్యాంక్ केनरा बैंक Canara Bank Syndicate Together we can

(భారత ప్రభుత్వ రంగ సంస్థ)
పాకాల శాఖ, పాకాల
తిరుపతి జిల్లా సెల్: 7901092637

### అమ్మకం ప్రకటన

**సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్)రూల్స్, 2002, 8(6)తో చదువబడే క్రింద స్థిరాస్తుల ఈ-వేలం అమ్మకం ప్రకటన**

ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయడమేమనగా దిగువ తెలిపిన రుణగ్రహీత(లు) మరియు గ్యారంటారు (లు) దిగువ తెలిపిన **రుణగ్రహీత శ్రీ విజయనగరం సనత్‌కుమార్, శ్రీ విజయనగరం మురళీక్రిష్ణ** గారికి చెందిన ఆస్తులను సెక్యూర్డు క్రెడిటారుకు తనఖా/ఛార్జిలో వుంచి నిర్మితంగా **అధీకృత అధికారి, పాకాల శాఖశాఖ, కెనరాబ్యాంక్** వారికి బకాయి వున్న **రూ.16,82,314.49 లను+వడ్డీ మరియు ఇతర ఖర్చులను** రాబట్టుకునేందుకు స్వాధీనం చేసుకుని **"ఎక్కడ ఎలా వున్నదో అక్కడ" "అక్కడ ఎలా వున్నదో అలానే" మరియు "అక్కడ ఏమి వున్నదో అదే అనే పద్ధతిపై 28.08.2025న వేలం వేయుటకు నిర్ణయించినారు.** రిజర్వుధర, ధరావత్తు, స్థిరాస్తుల యొక్క పూర్తి వివరాలు దిగువ తెలుపడమైనది.

**స్థిరాస్తి వివరములు:-** చిత్తూరు జిల్లా, పాకాల సబ్ జిల్లా, పాకాల మండలం, పాకాల రెవిన్యూ గ్రామలెక్కదాఖలా, పాకాల గ్రామ పంచాయతీ, వార్డునెం.64, కమతంపల్లి, ఆంజనేయులు గుడి వీధి రెసిడెన్షియల్ ఏరియా, సర్వేనెం.1323/2 లో ఎ.0.08 సెంట్లు, సర్వేనెం.1323/6 లో ఎ.0.09 సెంట్లు, పాత అసెస్‌మెంట్ నెం.2050 & కొత్త అసెస్‌మెంట్ నెం.2900, పాత డి.నెం.14-107 & కొత్త డి.నెం.14-126 గల ఆర్.సి.సి. బిల్డింగ్‌కు కొలతలు హద్దుల వివరం: తూర్పు: 13 అ. వెడల్పు గల రోడ్డు, పడమర: నాగరత్నం నాయుడు స్థలం, ఉత్తరం: కె.రాజెమ్మ ఇల్లు, దక్షిణం: 12అ. వెడల్పు గల రోడ్డు. కొలతలు: తూర్పు నుండి పడమర: 35అ. (10.67మీ.) ఉత్తరం- దక్షిణం: 30అ. (9.14మీ) వెరశి మొత్తం విస్తీర్ణం 1050 చ.అ.లేదా 117 చ.గ.ల స్థలం మరియు ఇందున వున్న ఆర్‌సిసి బిల్డింగ్‌కు కొలతలు: తూర్పు నుండి పడమర: 29 1/4అ. (8.92మీ.), ఉత్తరం: నుండి దక్షిణం: 26 1/4అ. (8.00మీ.) వెరశి మొత్తం బిల్డింగ్ విస్తీర్ణం 768 చ.అ. నిర్మాణం ఇందులోని ద్వారములు, ద్వారబంధనములు, బోరుబావి, ఎలక్ట్రిసిటీ కనెక్షన్ 5411212002317, కాంపౌండ్ గోడ తదితరాలతో సహా.

**రిజర్వు ధర : రూ.21,39,000.00** **ధరావత్తు : రూ.2,13,900.00**

**ధరావతు సమర్పణకు ఆఖారు తేది & సమయం : 25.08.2025 సా.5.00గంIIలకు లేదా ఆలోపు.** అమ్మకానికి సంబంధించిన పూర్తి నియమ నిబంధనలు కెనరాబ్యాంకు వారి వెబ్‌సైట్ **www.canarabank.com**లోని పొందుపరిచిన "ఈ-ఆక్షన్" అను లింక్‌ను పరిశీలించ గలరు. **లేదా అధీకృత అధికారి , కెనరాబ్యాంక్, ప్రాంతీయ కార్యాలయం, తిరుపతి, ఫోన్:0877-2500130,7901092637** వారిని కార్యాలయ పనివేళలో సంప్రదించగలరు.

**ప్రదేశం:తిరుపతి, తేది: 22.07.2025** **అధీకృత అధికారి, కెనరాబ్యాంక్**

# హత్య కేసులో వీడని మిస్టరీ!

నాయుడుపేట, జూలై 25 ప్రభాతవార్త : మండలంలోని అయ్యప్పరెడ్డిపాళెంకు చెందిన సగుటూరు చెంగమ్మను అల్లుడు బోడెద్దుల వెంకయ్య హత్యచేసి ఆపై స్వర్ణముఖినదిలో పూడ్చిపెట్టిన విషయం తెలిసిందే. అయితే హత్యచేసిన సంఘటనలో మరోఇద్దరు పాత్ర ఉందంటూ మృతురాలి కుమార్తెలు ఆరోపించ డంతో హత్యకేసు వీడని మిస్టరీగా మారింది. మంగళవారం నాయుడుపేటలో ఉన్న చెంగమ్మను అల్లుడు వెంకయ్య తన ఆటోలో తీసుకువెళ్ళేటప్పుడు అతనితోపాటు బోడెద్దుల ఉదయ్, సగుటూరు మల్లికార్జున్ ఆటోలో ఉన్నట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఆరోపణల మెరకు నాయుడుపేట సిఐ బాబి. చెంగమ్మను అల్లుడే హత్యచేశాడని, ఇతరుల పాత్ర ఎమైన ఉందన్నా అనుమానంలో ఉదయ్, మల్లికార్జున్‌ను గురువారం అదుపులోనికి తీసుకొని విచారించి వదిలేచారని వాపోయారు. అయితే బోడెద్దుల వెంకయ్య పోలీసుల విచారణలో హత్యకు తనతోపాటు మరోఇద్దరు సహాయం తీసుకొన్నట్లు పోలీసులకు తెలిపినట్లు విశ్వసనీయ సమాచ్చారం. అధికారపార్టీ నాయకులు ఒత్తిళ్ళకు తమతల్లి హత్యకు సహకరించిన ఉదయ్, మల్లికార్జున్‌లను కేసునుండి తప్పించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారని మృతురాలి కుమార్తెలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తమ తల్లి హత్యకు సహకరించిన ఉదయ్, మల్లికార్జున్‌లకు అదుపులోనికి తీసుకొని శిక్షపడే విధంగా చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరుతున్నారు.

## ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి



సూళ్లూరుపేట, జులై 25 ప్రభాతవార్త: ప్రభుత్వం 1989వ సంవత్సరంలో ప్రవేశపెట్టిన ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని శుక్రవారం తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశంలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ కోరారు. ఈ చట్టం అమలు విషయమై ఈ సమావేశంలో చర్చించారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఆర్డీఓ కిరణ్మయి తదితరుల నేతృత్వంలో ఈ సమావేశం జరిగింది. అలాగే జిల్లాలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, ఎంఎల్‌సీ బల్లి కల్యాణ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఉరేసుకుని ఒకరి మృతి

సూళ్లూరుపేట, జులై 25 ప్రభాతవార్త: తహశీల్దార్ కార్యాలయం వెనుక భాగాన బాపూజీ కాలనీకి చెందిన కేశవుల శివానంద (53) ఉరేసుకుని మృతిచెందాడు. శుక్రవారం ఉదయం తహశీల్దార్ కార్యాలయం వెనుక భాగాన ఉన్న చెట్టుకు శివానంద ఉరేసుకుని మృతిచెంది ఉండటాన్ని అక్కడి వారు గమనించారు. ఈ విషయమై స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ బ్రహ్మనాయుడు సంఘటన స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## రోడ్డుపై బైఠాయించిన రైతులు

**- పరిహారం ఇవ్వకుంటే ఆత్మహత్యలే శరణ్యం**



కోట, జులై 25 ప్రభాతవార్త: ప్రభుత్వం సాగర మాల రోడ్డు నిర్మాణానికి పేదల భూములను తీసుకుందని, అయితే పరిహారం మాత్రం ఇవ్వలేదంటూ శుక్రవారం మండల పరిధిలోని అగ్రహారం గ్రామ నిర్వాసితులు రోడ్డుపై బైఠాయించి రాకపోకలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ తాము శివాయి భూములు ఆక్రమించలేదని, డికెటి భూములు కాదని, తమవి ఒరిజినల్ పట్టా భూములని తహశీల్దార్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. తాము పలుమార్లు నష్టపరిహారం కోసం అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయిందన్నారు. తమకు పరిహారం ఇవ్వకపోతే ఆత్మహత్యలే శరణ్యమని వాపోయారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కె.జయజయరావు మాట్లాడుతూ సమస్యను జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని చెప్పారు. ఇప్పటికే గ్రామసభ కూడా గ్రామంలో నిర్వహించామని చెప్పారు. రైతు గాలి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం జరిగింది. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ పవన్‌కుమార్ సంఘటన స్థలానికి వెళ్లారు.

## ఎన్‌బికెఆర్‌లో ముగిసిన డిజైన్ శిక్షణా తరగతులు

కోట, జులై 25 ప్రభాతవార్త: మండలంలోని విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో ఆరు వారాలుగా నిర్వహించిన మెకానికల్ ఇంజినీరింగ్ డిజైన్ నైపుణ్య శిక్షణా తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బెంగళూరుకు చెందిన డైనమిక్ ఇంజినీరింగ్ సర్వీస్ అధిపతి ఎం.నాగార్జున విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కోర్సులో భాగంగా ఎంఎస్సీ నిష్ణాతుల చేత ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. పరిశ్రమలకు అనుగుణంగా కాస్టింగ్, ప్రస్సింగ్, షీట్ మెటల్ వంటి వివిధ విభాగాల్లో డిజైన్ ఇంజినీరింగ్‌కి కావలసిన స్కిల్స్‌పై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ స్కిల్స్ ద్వారా బిటెక్ నాలుగో సంవత్సరం పూర్తయ్యేలోపు మంచి ఉద్యోగాలు వచ్చేందుకు అవకాశాలు ఉన్నాయన్నారు. అనంతరం డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు పరిశ్రమల్లో అవసరాలకు అనుగుణంగా భవిష్యత్‌లో శిక్షణ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ సిహెచ్ విక్రమ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ శిక్షణలో ప్రతిభ కనబరచిన పవన్‌కుమార్, చాంద్‌బాషా, దేవీప్రసాద్ తదితర విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ వై.అశోక్‌కుమార్‌రెడ్డి, ప్రొఫెసర్ శ్రీహరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## టిప్పర్, ఆటో ఢీ...ఉపాధి కూలీ మృతి

కోట, జులై 25 ప్రభాతవార్త: మండలంలోని చిట్టేడు గ్రామం వద్ద ఆటోలో ఉపాధి హామీ పనులకు వెళుతుండగా గూడూరు వైపు నుంచి వస్తున్న టిప్పర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో కూలీ పనులకు వెళుతున్న పోలమ్మ అనే ఉపాధి హామీ కూలీ అక్కడికక్కడే మృతి చెందింది. మరో నలుగురు గాయపడ్డారు. క్షతగాత్రులను కోట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. టిప్పర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ పవన్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం



కోట, జులై 25 ప్రభాతవార్త : నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌పై వాకాడు జడ్పిటిసి రౌతు రామకృష్ణ చేసిన వ్యాఖ్యల పట్ల కోట మండల తెలుగుదేశం పార్టీకి చెందిన దళిత సంఘాలు భగ్గుమన్నాయి. శుక్రవారం కోటలోని నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో దళిత సంఘు నాయకులు, ఎంపిటిసి దారా సురేష్, చెంగల్రావు, మర్రి పోలయ్యలు మాట్లాడారు. నిరంతరం దళితవాడల్లో అభివృద్ధి కోసం పాటుపడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం మంచిది కాదన్నారు. ఈ సమావేశంలో నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, జలీల్ అహ్మద్, కోట మండల టిడిపి అధ్యక్షులు పలగాటి భాస్కర్‌రెడ్డి, నెల్లూరుపల్లి కొత్తపాలెం జలసంఘం అధ్యక్షులు నెల్లూరు మోహన్‌రెడ్డి, సిద్ధవరం సొసైటీ అధ్యక్షుడు కోటేశ్వరరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్యే బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి



గూడూరు, జులై 25 ప్రభాతవార్త: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, పేదల పాలిటి పెన్నిధి ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అని టిడిపి నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని గాంధీనగర్‌కి చెందిన ఒక నిరుపేద కుటుంబానికి చెందిన కాయల సంకీర్తన బిఎస్సి నర్సింగ్ తిరుపతిలో సౌజన్య మెడికల్ కాలేజీలో చదువుతున్న విద్యార్థినికి కాలేజీ ఫీజు నిమిత్తం 25,000 రూపాయలు ఆర్థిక సహాయం గాంధీనగర్ స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు యేసుపాకు పెంచలయ్య, రావూరు సురేంద్ర, మాతంగి పటాస్‌ల చేతుల మీదుగా కాయల లక్ష్మి కుటుంబానికి అందజేసారు.

## ఎస్.కే.ఆర్ డిగ్రీ కళాశాలలో ప్రాజెక్ట్ అరణ్య



గూడూరు, జూలై 25 ప్రభాతవార్త: స్థానిక ఎస్కెఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్.ఎస్.ఎస్ విద్యార్థుల సహకారంతో ప్రాజెక్ట్ అరణ్యలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. తపస్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ విపుల్ సింగ్, ప్రాజెక్టు కోఆర్డినేటర్ స్నేహదీప్ బిశ్వాస్ సహకారంతో దేశవ్యాప్తంగా ఇప్పటికీ 52 పట్టణాలలో రెండు లక్షలకు పైగా మొక్కలు నాటి హరితదేశ ఉద్యమానికి నాంది పలికారు. ఇందులో భాగంగానే ఎస్.కే.ఆర్ డిగ్రీ కళాశాల ఆవరణంలో మొక్కలు నాటి హరితాంధ్ర దిశగా విద్యార్థులకు ప్రేరణ కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి. విజయ మహేష్, రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ బి. పీర్ కుమార్, ఫిజికల్ డైరెక్టర్ పి. నారాయణ రాజు, డాక్టర్ కోటేశ్వరరావు, కిరణ్మయి, శ్రీధర్ శర్మ, డాక్టర్ ఝాన్సీ వాణి, కృపా కరుణ వాణి, డాక్టర్ శైలజ, రవి రాజు, హిమ బిందు, రమేష్, పద్మమ్మ, సుందరమ్మ, ఉష, శ్రీలత, తదితర అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## నిత్యం ప్రజలకు సేవ చేస్తున్న ఎమ్మెల్యే



గూడూరు, జూలై 25 ప్రభాతవార్త: నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎస్సీ ఎస్టీల అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పై వైసిపి నాయకులు అసత్య ఆరోపణలు చేయడానికి ఖండిస్తున్నామని వాస్తవాలు తెలుసుకొని వైసిపి నాయకులు మాట్లాడాలని ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ మెంబర్ సురేంద్ర పేర్కొన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టిడిపి ఎస్సి నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మెంబర్ సురేంద్ర మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎస్సీ ఎస్టి లకు గుర్తింపు ఇచ్చి వారి ఎదుగుదలకు ఎమ్మెల్యే ఎంతో ప్రోత్సహించారని ఎమ్మెల్యే పై వాకాడులో వైసీపీ నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఎస్సీలను ఎదగనీయడం లేదని చెప్పడం అవాస్తమని అన్నారు. ఈ సమావేశంలో వేముల సునీల్, మల్లి, గురవయ్య, శివ, పార్వతయ్య తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## వైసీపీ రీజినల్ కోఆర్డినేటర్‌ను కలిసిన నేదురుమల్లి

వెంకటగిరి, జూలై 25, ప్రభాతవార్త: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రీజియన్ కోఆర్డినేటర్ వెంకట నాగేశ్వరరావును నియోజకవర్గం సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ పరిస్థితులపై చర్చించారు. పలు రాజకీయ అంశాలపై ఇరువురు చర్చించుకున్నారు.

## నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలి సిఐ



వెంకటగిరి, జూలై 25 ప్రభాతవార్త : సైబర్ నేరాలు పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని సీఐ ఏవి రమణ విద్యార్థులకు సూచించారు. విశ్వదయ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. సైబర్ నేరాలు రోజురోజుకి పెరుగుతున్నాయని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు మార్గదర్వ్యాలకు బానిస కాకూడదని చెప్పారు. అందరూ ఉన్నత చదువులు అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. విద్యార్థులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు.

## పథకాలన్నింటిని ప్రభుత్వం అమలు చేసింది : ఎమ్మెల్యే



వెంకటగిరి, జూలై 25 ప్రభాతవార్త : ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నిటిని కూటమి ప్రభుత్వం అమలు చేసిందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరి మండలం చిన్నాన్నపేట గ్రామంలో కోటి 80 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించే రోడ్డుకు శంకుస్థాపన చేశారు. నూతనంగా నిర్మించిన సచివాలయ భవనం, ఎన్టీఆర్ సుజల పథకాన్ని ప్రారంభించారు. గత వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిందని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారాలకు వచ్చిన తర్వాత ఇప్పుడిప్పుడే రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. చిన్నాన్నపేట గ్రామంలో ఐదు కోట్ల రూపాయలతో సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు. నియోజకవర్గ పరిశీలకులు జన్ని రమణయ్య మాట్లాడుతూ వైసిపి వారు ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎంపీపీ తనుజా రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు చంద్రమౌళిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ విశ్వనాథం, నాయకులు మధు నాయుడు, శివారెడ్డి, ఎంపీడీవో గుణశేఖర్‌రెడ్డి, పంచాయతీరాజ్ డిఇ లక్ష్మీనారాయణ, సిఐ ఏవి రమణ తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి : ఎస్పై



వెంకటగిరి, జూలై 25 ప్రభాతవార్త: యువత మాదకద్రవ్యాలకు బానిస కాకూడదని ఎస్పై కామినేని గోపి తెలిపారు. మండలంలోని వెంగమాంబరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలు, చట్టాలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మాటక ద్రవ్యాలకు బానిస కాకూడదు అని తెలిపారు. సమావేశంలో ప్రిన్సిపల్ కరుణ కుమారి, గోపి తదితరులు పాల్గొన్నారు.

## నిర్మాణ పనులను అడ్డుకున్న రైతులు



చిల్లకూరు, జూలై 25 ప్రభాతవార్త: గూడూరు నియోజకవర్గం పరిధిలోని చిల్లకూరు మండలం ఉడతావారిపార్లపల్లి గ్రామం సమీపంలో సాగరమాల రహదారి నిర్మాణ పనులను రైతులు అడ్డుకున్నారు. గత కొన్ని నెలలుగా తెలంగాణ ప్రాంతానికి చెందిన మేఘ కంపెనీ కాంట్రాక్టరు సాగరమాల రహదారి నిర్మాణ పనులు చేపడుతున్నారు. భూములు కోల్పోయిన మాకు నష్ట పరిహారం చెల్లించే వరకు రహదారి నిర్మాణ పనులను అడ్డుకుంటామని రైతులు తేల్చి చెబుతున్నారు. ఇప్పటికే గతంలో కూడా పలుమార్లు రైతులు ఆందోళన చేపట్టారు. గుత్తేదారులు ఆవేదనను లెక్కచేయని ప్రభుత్వం నుండి నష్ట పరిహారం అందక ముందే నిర్మాణ పనులను ఎలా చేస్తారని బాధిత రైతులు ప్రశ్నిస్తున్నారు. ఆందోళన చేపడుతున్న ప్రాంతానికి చేరుకుని చిల్లకూరు మండల తహసీల్దార్ శ్రీనివాసులు రైతులతో మాట్లాడారు. నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.

## వైసీపీ నేతలు నోరు అదుపులో పెట్టుకోండి

వాకాడు, జూలై 25 ప్రభాతవార్త : వైసిపి నేతలు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని కూటమి నాయకులు తీవ్రస్థాయిలో హెచ్చరించారు. శుక్రవారం వాకాడులోని ఇరిగేషన్ అతిథి గృహంలో కూటమి నాయకులు టిడిపి మండల కన్వీనర్ దువ్వూరు మధుసూదన రెడ్డి, బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు పాపా రెడ్డి పురుషోత్తం రెడ్డి, జనసేన మండల అధ్యక్షులు రౌతు శివకుమార్, కూటమి నాయకులు మాజీ ఏఎంసీ చైర్మన్ పాపా రెడ్డి మనోజ్ కుమార్ రెడ్డి, వాకాడు సొసైటీ అధ్యక్షులు ప్రసాద్ రెడ్డి, సన్నా రెడ్డి ప్రసాద్ రెడ్డి, నందగోపాల్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, కోట ఎంపీటీసీ దారా సురేష్, తిరుమూరు శ్రీనివాసుల రెడ్డి, అరుణ్ కుమార్, మోహన్ నాయుడు, దయాకర్, తీపల పూడి రమణయ్య, రామలింగారెడ్డి, బుజిగేంద్రావు, గంగాధర్ రెడ్డి, చిరంజీవమ్మ, కవిత, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ఇకనైనా వైసీపీ నేతలు నోరు అదుపులో పెట్టుకోపోతే తగిన గుణపాఠం చెబుతామని కూటమి నాయకులు హెచ్చరించారు.

## జాతీయ రహదారిపై లారీ బోల్తా డ్రైవర్ కి గాయాలు

పెళ్లకూరు జూలై 25 ప్రభాతవార్త: పెళ్లకూరు మండలంలోని నేషనల్ హైవే పై పెళ్లకూరు వద్ద గల ఫ్లై ఓవర్ పై తిరుపతి వైపు నుండి ఫ్యాక్టరీ కు ఐరన్ వేస్ట్ మెటీరియల్ తీసుకు వెళుతున్న లారీ బోల్తా పడింది అదే సమయంలో వెనుక మరో వాహనం ఢీకొని వెళ్లిపోగా లారీ బోల్తా పడినది సమాచారం తెలుసుకున్న స్థానిక మొబైల్ డ్యూటీలో ఉన్న మైకేల్ సంఘటన స్థలం చేరుకొని రోడ్డుకు అడ్డంగా బోల్తా పడి ఉన్న వాహనాన్ని పక్కకు జరిపించి రాకపోకలకు అంతరాయం లేకుండా చేసి పెళ్ళకూరు పోలీస్ వారికి సమాచారం ఇవ్వడం జరిగింది. పెళ్లకూరు పోలీసు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**కుక్కను తప్పించబోయి కారు బోల్తా:**

పెళ్లకూరు మండలంలోని కొత్తూరు గ్రామం వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం అమలాపురం నుండి తిరుపతి వెళుతున్న కారు కుక్క ను తప్పించబోయి సడన్ బ్రేక్ వేసి ఎడమ చేతి వైపు ఐరన్ డివైడెరు ను గుద్దుకొని పంట పొలాల్లో బోల్తాపడడంతో కారులో ప్రయాణిస్తున్న ఉదయ్ కిరణ్ (27) సిహెచ్. ధన శేఖర్ ( 29) సిహెచ్ .నవ సతీష్ (29) సిహెచ్ .శివ సాయి(25) నలుగురికి గాయాలు అవ్వడంతో 108 సహాయముతో చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించడం జరిగినది.

## బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి చేయండి

పాకాల, జులై 25 ప్రభాతవార్త : కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మొదలు పెట్టిన జాతీయ ఉపాధి పథకంలో ఉపాధి పొందుతున్న కూలీలకు బయోమెట్రిక్, ఐరిష్ హాజరు తప్పనిసరి చేయాలి అని ప్రజలు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. గత కొంత కాలంగా ఉపాధి హామీ పథకంలో లబ్ధిదారుల ఎంపిక, కూలీలకు పనులు కల్పించే విషయంలో పెద్ద ఎత్తున తప్పులు దొర్లుతున్నాయి అని వస్తున్న ఆరోపణలకు ఈ పద్ధతి అడ్డుకట్ట వేస్తుంది అని ప్రజలు అంటున్నారు. కొంత మంది ఫీల్డ్ అసిస్టెంట్లు మాయాజాలంతో కూలి పనికి రాకపోయినా వాళ్ల జాబ్ కార్డుల ద్వారా లబ్ధి చేకూర్చే విధంగా అక్రమాలకు పాల్పడుతున్నారు అనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఇది ఒక సమాధానంగా నిలుస్తుందన్నారు. బయట రాష్ట్రాలలో ఉద్యోగాలు చేసేవారు సైతం ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్లో జాబ్ కార్డుల ద్వారా గుంతలు తీశామని ప్రభుత్వాన్ని తప్పు ధోవ పట్టిస్తున్నారు. ఉపాధి హామీ పథకంలో ఉన్న లబ్ధిదారుల ఆధార్ కార్డ్, పాన్ కార్డు, బ్యాంక్, మరియు పోస్టల్ అకౌంట్ లింక్ చేసి వారి కుటుంబానికి సంవత్సర ఆదాయం ఎంత వుందో చూడాలని అంటున్నారు. ఈ రాష్ట్రంలో ఉపాధి పొందుతున్నారా..! పక్క రాష్ట్రాల్లో ఉపాధి పొందుతున్నారా..! ఎప్పటికప్పుడు సరిచూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం పైన ఉంది. ఉపాధి హామీ పథకంలో అధికారులకు ఫీల్డ్ అసిస్టెంట్ల మధ్య పరస్పర అవగాహనతో దొంగలు ఊర్లు పంచుకున్నట్లు సాగుతున్న ఈ ప్రక్రియ సరికాదు అని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం నిజమైన లబ్ధిదారులకు న్యాయం జరిగేలా ప్రస్తుత పాలకులు, అధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బంది వ్యవహరించాలని తెలియజేసారు.

## హోం మంత్రి అనితకు ఘన స్వాగతం.



రేణిగుంట జూలై 25 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనితకు రేణిగుంట రైల్వే స్టేషన్లో శుక్రవారం రాత్రి ఘన స్వాగతం లభించింది. విజయవాడ నుండి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ లో ఆమె రేణిగుంట రైల్వే స్టేషన్ చేరుకున్నారు. హోం మంత్రికి రేణిగుంట డిఎస్పి శ్రీనివాస రావు ఆధ్వర్యంలో అర్బన్ సీఐ జయచంద్ర, అర్బన్ ఎస్పై అరుణ్ కుమార్ రెడ్డి తమ సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. హోంమంత్రికి లాఅండ్‌ఆర్డర్ అడిషనల్ ఎస్పీ రవిమనోహరాచారి, రేణిగుంట డిఎస్పి శ్రీనివాస రావు, ఆర్పిఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ రాజగోపాల్ రెడ్డి, అర్బన్ సీఐ జయచంద్ర, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సీఐ వెంకటేశ్వర్లు, రేణిగుంట రైల్వే సీఐ యతేంద్ర, రేణిగుంట అర్బన్ ఎస్ఐ అరుణ్ కుమార్ రెడ్డి, రైల్వే ఎస్పై ధర్మేంద్ర, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఎస్పైలు రమేష్, శ్రీనిష్ తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆమె భారీ బందోబస్తు నడుమ రోడ్డు మార్గంలో తిరుపతి బయలుదేరి వెళ్లారు.

## సుపరిపాలన దిశగా కూటమి ప్రభుత్వం: గంజి మాధవయ్య



పుత్తూరు, జూలై 25 ప్రభాతవార్త : రాష్ట్రంలో సుపరిపాలన కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమైందని పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గంజి మాధవయ్య అన్నారు. శుక్రవారం పుత్తూరు రూరల్ మండల రామకృష్ణాపురం పంచాయతీలోని 38వ బూత్ పరిధిలో జరిగిన సుపరిపాలన - తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికీ వెళ్లి గత ఏడాది కాలంలో తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం ప్రజలకు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పనులను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి పాలన మొదలైన ఏడాదిలోనే 90 శాతం హామీలు నెరవేర్చామని తెలిపారు. ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ నేతృత్వంలో నగరి నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో రూరల్ మండల అధ్యక్ష, కార్యదర్శులు అరవ బాలాజీ, వెంకటేష్, బూత్ ఇన్‌ఛార్జ్ హరి, తడుకు సింగిల్ విండో డైరెక్టర్ విజయభాస్కర్ రెడ్డి, టిడిపి నాయకులు హేమంత్, గంజి వరప్రసాద్, తిరుమలరావు, కె.మనోహర్, వెంకటేష్, గిరిప్రసాద్ స్థానిక గ్రామస్తులు పాల్గొన్నారు.

## తిరుపతిలో భారీగా గంజాయి పట్టివేత

తిరుపతికార్పొరేషన్, జూలై 25ప్రభాతవార్త: తిరుపతి నగరంలోని నరసింహతీర్థంరోడ్డులో ఓ పాఠశాల సమీపంలో భారీగా గంజాయిని వెస్టు పోలీసులు పట్టుకున్నారు. ఈ గంజాయిని విక్రయించేందుకు సిద్ధంగా ఉంచుకున్న ముగ్గురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నగరంలోని నరసింహతీర్థం రోడ్డులో ఓ పాఠశాల వద్ద 10 కిలోల గంజాయి సంచులతో ముగ్గురు యువకులు తిరుపతి భవానీనగర్‌కి చెందిన వేలూరు హరికృష్ణ, అశోక్‌నగర్‌కు చెందిన పి.రామకృష్ణ, బైరాగిపట్టెడవాసి రెడ్డిచర్ల అరుణ్‌కుమార్ ఒరిస్సా రాష్ట్రంనుండి గంజాయిని రవాణా చేసుకువచ్చారు. కిలో 20వేల రూపాయలకు కొనుగోలుచేసి ఇక్కడ యువతకు, కాలేజీ విద్యార్థులకు విక్రయించేవారని తెలిపారు. దీనిపై వెస్టు పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రధాన ముద్దాయి నితిన్ పరారీలో ఉన్నాడని సిఐ తెలిపారు.

## ఆటోదొంగ అరెస్టు

తిరుపతికార్పొరేషన్, జూలై 25ప్రభాతవార్త: తిరుపతిలో ఆటోను చోరీచేసిన దొంగను ఈస్టు పోలీసులు అరెస్టుచేశారు. శుక్రవారం సాయంత్రం ఈస్టు సిఐ కె.శ్రీనివాసులుఆదేశాలతో ఎస్ఐ హేమాద్రికి అందిన సమాచారంతో రామ్‌తులసీ కల్యాణమండపం వద్ద ఆటోను చోరీచేసిన తనపల్లి ఇందిరమ్మగృహాలకు చెందిన పత్తి ఆదర్స(22)ని అరెస్టుచేశారు. అతని నుండి 2.20లక్షల రూపాయలువిలువైనఆటోను స్వాధీనం చేసుకున్నారు.

## ఆడబిడ్డలను మోసం చేసిన ముఖ్యమంత్రి, డిప్యూటీ సిఎం : మాజీ మంత్రి ఆర్.కె.రోజా




విజయపురం, జూలై 25 ప్రభాతవార్త : ఎన్నికలపుడు తాము అధికారంలోకి వస్తే ప్రతి మహిళకు ఆడబిడ్డ నిధి పథకం కింద ప్రతి నెలకు రూ. 1500 ఇస్తామని ఇచ్చిన చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్ అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఆ హామీని నెరవేర్చకుండా మహిళలను మోసం చేశారని వైసిపికి చెందిన పర్యాటక శాఖ మాజీ మంత్రి ఆర్.కె.రోజా విమర్శించారు. రాష్ట్రంలో ఈ పథకానికి అర్హులైన 2 కోట్ల, 75 లక్షల మంది మహిళలకు వెన్నుపోటు పొడిచారన్నారు. మండలంలోని శ్రీహరిపురం వద్ద నిర్వహించిన బాబు ష్యూరిటీ, వెన్నుపోటు గ్యారంటీ కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. ఆడబిడ్డ నిధి పథకం అమలు చేయాలంటే ఆంధ్రప్రదేశ్‌ను అమ్మాలని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెంనాయుడు వ్యాఖ్యానించడం సిగ్గు చేటని పేర్కొన్నారు. మూడు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు సూపర్ సిక్స్ అంటూ చెప్పిన హామీలను అమలు చేస్తున్నామని ప్రజలను మోసం చేస్తున్నారని, ఇంత కంటే రాష్ట్రానికి పట్టిన దౌర్భాగ్యం మరొకటి వుండదని తెలిపారు. జగన్మోహనరెడ్డి తొలిసారి ముఖ్యమంత్రిగా వున్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలు వంద శాతం నెరవేర్చారని తెలిపారు. నగరి నియోజకవర్గంలో జగనన్న సహకారంతో తాను ప్రజల కోరిక మేరకు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టానని గుర్తు చేశారు. కార్యక్రమంలో పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రావణ శుక్రవారం పూజలు



పుత్తూరు(నగరి), జూలై 25 ప్రభాతవార్త : తెలుగు, తమిళ సంప్రదాయాల కలయికతో కూడిన నగరిలో విశేషమైన రోజుగా పరిగణించే శ్రావణమాసం ప్రారంభం సందర్భంగా శుక్రవారం మాజీ మంత్రి ఆర్.కె.రోజా నేత్ర ప్రదాయని శ్రీ దేశమ్మ తల్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పొంగళ్లు పెట్టి, నైవేద్యం సమర్పించి పూజలు, అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల శాంతి, సమృద్ధి, క్షేమం కోసం అమ్మవారిని ప్రార్థించినట్టు తెలిపారు. కార్యక్రమంలో నగరి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆలయ మాజీ ఛైర్మన్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

## శిలా ఫలకాలను ధ్వంసం చేయటమే సంస్కృతా? : మధుసూధనరెడ్డి

శ్రీకాళహస్తి, జూలై 25 ప్రభాతవార్త: ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఆ పాలకులు చేసిన ప్రగతికి సంబంధించిన ప్రారంభోత్సవాల సందర్భంగా శిలా ఫలకాలను వేసుకోవటం ఆనవాయితి అని అయితే గతంలో తాము పరిపాలించిన కాలంలో వేసిన శిలాఫలకాలను ప్రస్తుత శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ఆయన అనుచరులుధ్వంసం చేయటమే అభివృద్ధి అనుకుంటున్నారా? అని మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూదనరెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో వేసిన శిలా ఫలకాలను ధ్వంసం చేయటాన్ని పరిశీలించారు. ఎపిసీడ్స్, శివ సర్కిల్ వద్ద వేసిన శిలా ఫలకాలను పరిశీలించారు. అలాగే ప్రభుత్వాసుపత్రి, సుబ్రమణ్యం స్వామి కొండ వద్ద, బసవయ్యపాళెం వద్ద నంది సర్కిల్ వద్ద శిలాఫలకాలను ధ్వంసం చేసి ఉండటాన్ని వారు పరిశీలించారు.

## ఘనంగా పిసి రాయలు జన్మదిన వేడుకలు




తిరుపతి విద్య, జూలై 25 ప్రభాత వార్త : కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పి సి రాయలు జన్మదిన వేడుకలు తిరుపతిలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం తిరుచానూరు రోడ్డులోని శిల్పారామం లో ఆయన జన్మదినం సందర్భంగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి మందులు అందజేశారు. అనంతరం తిరుమలలో శ్రీవారి అన్నదాన ట్రస్ట్ కు పది లక్షల రూపాయలు విరాళం అందజేశారు. ఈ మేరకు గాంధీ రోడ్ లోని ఆయన కార్యాలయం ఎదుట 1000 మంది పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆయన జన్మదినం సందర్భంగా తిరుపతిలోని పలు పార్టీ నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపి దుస్సాలవతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ పాలకమండలి సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షులు సామాజి శ్రీనివాస్, మధు సూదన్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, ఉదయగిరి కృష్ణమూర్తి, ట్రస్ట్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గణనాధుడిని దర్శించుకున్న హౌసింగ్ కార్పొరేషన్ ఎండి



కాణిపాకం, జూలై 25 ప్రభాతవార్త: రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండి శివప్రసాద్ శుక్రవారం కుటుంబ సమేతంగా కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఎఇఓ ధనంజయ, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. అలాగే వారు శ్రీ వీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి వేదమండపంలో వేద ఆశీర్వచనం చేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలను శేషవస్త్రాలు, చిత్రపటంను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరిటెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ చిట్టిబాబు, జిల్లా హౌసింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద రామస్వామికి మండప నిర్మాణం

పుంగనూరు, జూలై 25 ప్రభాతవార్త : పట్టణంలోని కట్టకిందపాల్యంలో వెలసిన పెద్దరామస్వామి ఆలయానికి నిర్మాణం మూడు రోజులలో చేపడతామని బీసీవై పార్టీ వ్యవస్థాపకులు బోడె రామచంద్ర యాదవ్ హామీ ఇచ్చారు. శుక్రవారం రాత్రి ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హనుమాన్ సేవా సంఘం సభ్యులు, స్థానికులు ఆలయం ఎదుట మండపం నిర్మించాలని అభ్యర్థించగా వెంటనే స్పందించి మండపం నిర్మాణానికి ఆయన హామీ ఇచ్చారు. మూడు రోజుల్లో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. స్థానికులు ఆయనకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కటకిందపాలెం ప్రజలు, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.